E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

01-4-2025 మంగళవారం | పేజీలు–6 | హైదరాబాద్ | ekaburu.com



కన్నుల పండువగా రంజాన్ వేడుకలు.. భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు 2లో



# హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ ( జీసీసీ ) ఏర్పాటు

- సీఎం రేవంత్ రెడ్డితో కీలక చర్చలు
- హైదరాబాద్ – ప్రపంచ స్థాయి టెక్ హబ్
- భారతదేశంలో తొలి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ & డేటా అనలిటిక్స్ ఫోకస్

2లో

## 2300 ఉద్యోగాలు.. లైన్ క్లియర్..

## ఎస్ఆర్‌హెచ్ హెచ్‌సీఏ వివాదం.. విజిలెన్స్ విచారణకు



2లో



2లో

## ఫిలిప్పీన్స్ దేశానికి తెలంగాణ బియ్యం: కాకినాడ పోర్టులో ప్రారంభించిన మంత్రి ఉత్తమ

# హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం విద్యార్థుల పోరాటం

- ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు
- రాహుల్ గాంధీ మౌనం ఎందుకు?
- ప్రభుత్వం భూములను అమ్మకానికి కుట్ర?
- రేవంత్ రెడ్డి ఆస్తుల అమ్మకం, అప్పుల పాలసీ
- రేవంత్ రెడ్డి ఆస్తుల అమ్మకం, అప్పుల పాలసీ
- సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు మద్దతుగా పోరాటం



**ఈ-కబురు,హైదరాబాద్:**
హైదరాబాద్ నగరం, విశ్వవిద్యాలయ భవిష్యత్ కోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు పడుతున్న ఆరాటం చాలా గొప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పాటుపడుతున్న విద్యార్థులపైన ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమైన అణచివేతకు పాల్పడుతుందని కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్ నగరం, విశ్వవిద్యాలయ భవిష్యత్ కోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు పడుతున్న ఆరాటం చాలా గొప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ తరువాయి 3లో



## పుతిన్‌పై ట్రంప్ మండిపాటు.. స్పందించిన రష్యా!

**రష్యా అధినేత పుతిన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యల వ్యవహారంపై క్రెమ్లిన్ స్పందించింది.**

**ఈ-కబురు:**
ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించేందుకు చొరవ చూపుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ .. పుతిన్, జెలెన్‌స్కీలపై ధ్వజమెత్తిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై 3లో



## స్టాలిన్ ఉగాది పోస్ట్.. కన్నడ వాసుల ఆగ్రహం

**తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఉగాది సందర్భంగా చేసిన పోస్ట్‌పై కన్నడిగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇంతకీ ఆయన ఏమన్నారంటే..?**

**ఈ-కబురు :**
ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదివారం తన సామాజిక మాధ్యమ ఖాతాలో పోస్ట్ చేశారు. తెలుగు, కన్నడ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అయితే, అందులో కన్నడిగులను ఆయన ద్రవిడులుగా పేర్కొనడం వివాదానికి దారితీసింది. స్టాలిన్ పోస్ట్‌పై పలువురు కన్నడ వాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

"నూతన సంవత్సరాదికి కొత్త ఆశలతో స్వాగతం పలుకుతున్న తెలుగు, కన్నడ మాట్లాడే ద్రవిడ సోదరులు, సోదరీమణులకు ఉగాది శుభాకాంక్షలు. హిందీ భాష 3లో



# 'మహా విషాదం'లో మయన్మార్.. 2వేలకు పైనే మృతులు..

## ఇంకా దొరకని వందల మంది ఆచూకీ!

**మయన్మార్‌లో భూకంపం ప్రభావంతో మృతుల సంఖ్య 2వేలు దాటింది.**

**ఈ-కబురు:**
వరుస భూప్రకంపనలతో వణికిన మయన్మార్‌లో మహా విషాదం నెలకొంది. భూకంపం ధాటికి నేలమట్టమైన భవనాల శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృతుల సంఖ్య భారీగా పెరుగుతోంది. భూవిలయంలో మృతుల సంఖ్య 2,056కి పెరగగా.. 3900 మందికి పైగా గాయపడినట్లు మయన్మార్ సైనిక ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటికీ ఇంకా 270 మంది ఆచూకీ లభ్యం కాలేదని తరువాయి 2లో

# ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్.. వరంగల్ మహిళా మావోయిస్టు మృతి

**ఛత్తీస్‌గఢ్ లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వరంగల్‌కు చెందిన మహిళా మావోయిస్టు మృతిచెందినట్లు అధికారులు వెల్లడించారు.**



**ఈ-కబురు (ఛత్తీస్‌గఢ్):**
ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. బస్తర్ ప్రాంతంలో సోమవారం భద్రతా సిబ్బంది, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మహిళా మావోయిస్టు మృతి చెందింది. ఆమెను వరంగల్ వాసి రేణుకగా గుర్తించారు. మృతురాలి తలపై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు నక్కినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో డీఆర్‌జీ సిబ్బంది యాంటీనక్సలైట్ ఆపరేషన్ చేపట్టారు. ఈక్రమంలో మావోయిస్టులు కాల్పులకు తెగబడగా.. భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఎన్‌కౌంటర్ అనంతరం ఘటనాస్థలంలో ఓ మహిళా నక్సలైట్ మృతదేహాన్ని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మృతురాలిని తెలంగాణలోని వరంగల్‌కు చెందిన రేణుక అలియాస్, చైతి అలియాస్ సరస్వతిగా గుర్తించారు. ఈమె మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా వ్యవహరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రెస్ టీమ్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆమె తలపై రూ.25లక్షల రివార్డు ఉన్నట్లు చెప్పారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భారీఎత్తున తుపాకులు, ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి ఈ ఏడాది ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్‌లో 135 మంది మావోయిస్టులను భద్రతా సిబ్బంది హతమార్చారు. ఇందులో 119 మంది ఒక్క బస్తర్ డివిజన్‌లోనే మరణించినట్లు అధికారులు తెలిపారు. గత శనివారం సుక్మా, బీజాపూర్‌లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో 18 మంది మావోయిస్టులు చనిపోయారు. వీరిలో 11 మంది మహిళలే కావడం గమనార్హం.

కాగా.. ఆపరేషన్ కగార్‌లో భాగంగా మావోయిస్టుల ఏరివేత కొనసాగుతోంది. గత మూడు నెలలుగా జరుగుతున్న భారీ ఎన్‌కౌంటర్లలో అనేక మంది మావోయిస్టులు తరువాయి 2లో



## 38 సొరంగాలు.. 927 వంతెనలు దాటుతూ 'వందేభారత్' పరుగులు..

### 19న ప్రారంభించనున్న ప్రధాని

**కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వందేభారత్ రైలు సర్వీసులు కశ్మీర్ లోయలో తొలిసారి అందుబాటులోకి రానున్నాయి.**

**ఈ-కబురు, జమ్మూ:**
కశ్మీర్ లోయ లో తొలిసారి వందేభారత్ రైలు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఏప్రిల్ 19న తొలి వందే భారత్ రైలు కాత్రా నుంచి కశ్మీర్‌కు పరుగులు పెట్టనుంది. ఉదంపుర్‌శ్రీనగర్ బారాముల్లా మధ్య 272 కి.మీల మేర ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన రైలు లింక్ ప్రాజెక్టు పూర్తయిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 19న ప్రధాని మోదీ ఉదంపుర్ వస్తారని.. ప్రపంచంలోనే 2లో



## దేశ సంస్కృతి వటవృక్షం ఆరెస్సెస్

**రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)ను దేశ అజరామర సంస్కృతి, ఆధునికీకరణ వటవృక్షంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు.**

2లో

# పకడ్బందీగా 'రాజీవ్ యువ వికాసం' అమలు చేయండి: భట్టి విక్రమార్క

**నిరుద్యోగుల కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది.**



**ఈ-కబురు,హైదరాబాద్:**
నిరుద్యోగుల కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకం దరఖాస్తుల గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. ఏప్రిల్ 14 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అనుమతిచ్చింది. ఈ పథకం అమలు తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్, పలువురు కలెక్టర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం యూనిట్ల విలువ ఆధారంగా రుణాలను మూడు క్యాటగిరీలుగా విభజించింది. క్యాటగిరీ 1 కింద రూ. లక్ష వరకు రుణం అందిస్తుంది. అందులో 80 శాతం రాయితీ ఉంటుంది. క్యాటగిరీ 2 కింద రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తుంది. అందులో 70 శాతం రాయితీ కల్పిస్తుంది. క్యాటగిరీ 3 కింద రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల లోపు రుణాలను అందజేయనుండగా.. అందులో 60 శాతం రాయితీ లభిస్తుంది.

# కంచ గచ్చిబౌలి భూముల వివాదం..

## 2 డాక్యుమెంట్లు విడుదల చేసిన ప్రభుత్వం

**కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై తెలంగాణ ప్రభుత్వం 2 డాక్యుమెంట్లు విడుదల చేసింది.**

**ఈ-కబురు,హైదరాబాద్:**
కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై తెలంగాణ ప్రభుత్వం 2 డాక్యుమెంట్లు విడుదల చేసింది. వాటి ప్రకారం.. 2004 ఫిబ్రవరి 3న 534.28 ఎకరాల భూమిని ప్రభుత్వానికి హెచ్‌సీయూ అప్పగించింది. అదేరోజు గోపనపల్లిలో 397.16 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం హెచ్‌సీయూకి కేటాయించింది. సంబంధిత డాక్యుమెంట్లపై హెచ్‌సీయూ అప్పటి రిజిస్ట్రార్, శేరిలింగంపల్లి అప్పటి రెవెన్యూ అధికారులు సంతకాలు చేశారు.

**ఇద్దరు వ్యక్తుల అరెస్టు**

కంచి గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఆందోళన చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు మాదాపూర్ డీసీపీ వెల్లడించారు. "ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కంచ గచ్చిబౌలిలోని టీజీఐఐసీకి చెందిన 400 ఎకరాల భూమిని చదును చేసేందుకు అధికారులు వచ్చారు. అదే సమయంలో హెచ్‌సీయూకి చెందిన కొంతమంది ఆందోళనకు దిగారు. జేసీబీలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. రాళ్లు, కర్రలతో పోలీసులపై తరువాయి 3లో



## గ్రూప్1 అభ్యర్థుల అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి: బండి సంజయ్

**ఎంఐఎం, భారాస, కాంగ్రెస్ పార్టీలన్నీ ఒక్కటేనని భాజపా నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.**

**ఈ-కబురు:** ఎంఐఎం, భారాస, కాంగ్రెస్ పార్టీలన్నీ ఒక్కటేనని భాజపా నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు పార్టీలు ఏకమయ్యాయని ఆరోపించారు. కాంగ్రెస్, భారాసకు ఓట్లున్నా పోటీ చేయడం లేదన్నారు. కాంగ్రెస్, భారాస కలిసి ఎంఐఎంను గెలిపించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు.

గ్రూప్ 1 అభ్యర్థుల అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో న్యాయ విచారణ చేయాలన్నారు. ''భారాస హయాంలో గ్రూప్ 1 పేపర్ లీక్ అయింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రూప్ 1లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వస్తున్నాయి. మూల్యాంకనంలో జరిగిన అవకతవకలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. న్యాయవిచారణ జరిపించాలి. కష్టపడి చదివిన అభ్యర్థులకు అన్యాయం చేయొద్దు'' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## 'మహా విషాదం'లో మయన్మార్.. 2వేలకు పైనే మృతులు..

### ఇంకా దొరకని వందల మంది ఆచూకీ!

మొదటి పేజీ తరువాయి

తెలిపింది. ఒకవైపు మృతదేహాలు.. మరోవైపు క్షతగాత్రులతో అక్కడి ఆస్పత్రులు కిక్కిరిసిపోయాయి. భూకంపం వచ్చి మూడు రోజులు గడుస్తున్న నేపథ్యంలో శిథిలాల కింద చిక్కుకున్నవారి పరిస్థితిపై తీవ్ర ఆందోళన నెలకొంది. మరోవైపు, మూడు రోజులుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుండగా.. తమవారు సజీవంగానే ఉండొచ్చనే ఆశతో పలువురు తమ చేతులతో శిథిలాలను తొలగిస్తున్న దృశ్యాలు హృదయాలను కలచివేస్తున్నాయి.

**మయన్మార్ భూవిలయం.. ప్రార్థనలు చేస్తూనే 700 మంది సజీవ సమాధి**

మయన్మార్‌లో భూకంపం తీవ్రతపై సైనిక ప్రభుత్వం విడుదల చేస్తున్న సమాచారంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2021 నుంచి ఆ దేశంలో మీడియాపై నియంత్రణ, ఇంటర్నెట్ వినియోగం పరిమితం చేయడం వంటి ఘటనలే ఇందుకు కారణం. అక్కడ వేలాది మంది ప్రజలు నీరు, విద్యుత్ లేక అల్లాడుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. భూవిలయంతో జరిగిన విధ్వంసాన్ని కవర్ చేసేందుకు తమకు అనుమతించాలంటూ అంతర్జాతీయ జర్నలిస్టుల అభ్యర్థనను సైతం అక్కడి ప్రభుత్వం తిరస్కరించినట్లు సదరు కథనాలు తెలిపాయి. మరోవైపు, మయన్మార్‌లోని సాగింగ్ నగరంలోని ఓ హైస్కూల్‌లో ఎనిమిది మంది చిన్నారులు, ముగ్గురు టీచర్లు ఇప్పటికీ శిథిలాల్లోనే చిక్కుకొని ఉన్నట్లు సహాయక సిబ్బంది తెలిపారు.

**థాయ్‌లాండ్‌లో 20కి పెరిగిన మృతులు**

ఇదిలా ఉండగా.. థాయిలాండ్‌లో మృతుల సంఖ్య 20కి పెరిగింది. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో పరిస్థితి చాలా వరకు సాధారణ స్థితికి వచ్చినట్లు ఆ దేశ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్ర వెల్లడించారు. బ్యాంకాక్ నగరంలో కుప్పకూలిన ఎత్తైన భవనం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆ భవనంలో వద్దే ఇప్పటివరకు 13 మృతదేహాలను గుర్తించారు. వీరిలో ఎనిమిది మంది పురుషులు కాగా.. ఐదుగురు మహిళలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, భవనాలు నేలమట్టమై మూడు రోజులు కావడంతో శిథిలాల కింద ఉన్నవారు సజీవంగా ఉండటం కష్టమేనని పలువురు పేర్కొంటున్నారు.

## కన్నుల పండువగా రంజాన్ వేడుకలు.. భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు

**ఈ-కబురు( ఢిల్లీ ) :** నెల రోజుల ఉపవాస దీక్ష ముగిసింది. ప్రపంచ వ్యాప్తంగా రంజాన్ పర్వదినం కన్నుల పండువగా జరుగుతోంది. అన్ని మసీదుల్లో సామూహికంగా నమాజులు జరుగుతున్నాయి. ఈకబురు ఢిల్లీ జామా మసీదు, హైదరాబాద్ మక్కా మసీదుతోపాటు.. అనేక ప్రాంతాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు చేస్తున్నారు. రాత్రి నెలవంక దర్శనమిచ్చింది. మసీదులు, ముస్లింల గృహాల్లో సందడి నెలకొంది. ముస్లింల ముఖాల్లో ఆనందోత్సాహాలు కనిపించాయి. ఆదివారం రాత్రి నమాజుల అనంతరం నెలవంక కనిపించడంతో ముస్లింలు పవిత్ర రంజాన్ మాసం ముగింపు సూచకంగా భావించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలింగనాలు చేసుకున్నారు. సామూహిక ప్రార్థల దృష్ట్యా మున్సిపల్, పోలీసు, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. షామియానాలు, టెంట్లు, కార్పెట్లు, సౌండ్ సిస్టంలు, త్రాగునీటి సౌకర్యం కల్పించారు. ప్రార్థనల సమయంలో పోలీసులు వాహనాల దారి మళ్లింపు చర్యలు చేపట్టనున్నారు.

## 38 సొరంగాలు.. 927 వంతెనలు దాటుతూ 'వందేభారత్' పరుగులు

మొదటి పేజీ తరువాయి

అత్యంత ఎత్తైన రైల్వే వంతెనను సందర్శించి.. ప్రారంభిస్తారని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. అనంతరం కాట్రా నుంచి వందే భారత్ రైలుకు పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు.

ప్రధాని మోదీకి ప్రైవేట్ సెక్రటరీగా నిధి తివారీ.. ఆమె ఎవరంటే..?

జమ్మూ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నందున జమ్మూ కాట్రా శ్రీనగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ తొలుత కాట్రా నుంచి ప్రారంభం కానుంది. ఈ రైలు లింక్ ప్రాజెక్టు గత నెలలోనే పూర్తయిందని.. ట్రయల్ రన్ కూడా విజయవంతంగా నిర్వహించగా రైల్వే సేఫ్టీ కమిషన్ రైలు సర్వీసులు నడిపేందుకు ఆమోదం తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. ఈ రైలు ప్రారంభోత్సవంతో కశ్మీర్‌కు ప్రత్యక్ష రైలు అనుసంధానం చేపట్టాలన్న చిరకాల డిమాండ్ నెరవేరనట్లవుతుంది. ప్రస్తుతం కశ్మీర్ లోయలోని సంగల్దాన్, బారాముల్లా మధ్య, అలాగే, కాట్రా నుంచి దేశంలోని మిగతా గమ్యస్థానాలకు మాత్రమే రైల్వే సర్వీసులు ఉన్నాయి.

కశ్మీర్‌ను రైల్వే సర్వీసులతో అనుసంధానించే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు 1997లోనే ప్రారంభమైనప్పటికీ.. అనేక భౌగోళిక, వాతావరణ సవాళ్లు, ప్రతికూల పరిస్థితుల కారణంగా జాప్యం చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టులో మొత్తం 119 కి.మీల పొడువునా 38 సొరంగాలు ఉండగా.. వీటిలో 12.75 కి.మీల మేర నిర్మించిన టీ49 సొరంగం అత్యంత పొడవైనది. అలాగే, ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో 927 వంతెనలు సైతం ఉన్నాయి. వీటిలో చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన కూడా ఉంది. దీని ఎత్తు 359 మీటర్లు కాగా.. పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 35 మీటర్లు ఎక్కువ కావడం విశేషం

## హైదరాబాద్‌లో 'వాన్‌గార్డ్' (జీసీసీ) ఏర్పాటు
# మరో 2300 ఉద్యోగాలు.. లైన్ క్లియర్..

**ప్రపంచ ప్రఖ్యాత ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ వాన్‌గార్డ్ గ్రూప్ హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ప్రారంభించనుంది. ఇది భారత్‌లో వారి తొలి జీసీసీ. సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అనంతరం ఈ ప్రకటన చేశారు. ఈ ఏడాది చివరి నాటికి జీసీసీ కార్యాలయాన్ని ప్రారంభించి, 4 సంవత్సరాల్లో 2,300 ఉద్యోగులను నియమించుకునేది లక్ష్యంగా వాన్‌గార్డ్ పెట్టుకుంది.**



**జీసీసీ నెలకొల్పడానికి ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తుందని కంపెనీ ప్రతినిధులకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. వైవిధ్యమైన ప్రతిభతో పాటు, జీవన నాణ్యత, సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణలకు హైదరాబాద్ అనుకూలమైన వాతావరణం కలిగి ఉందని కంపెనీ సీఈవో సలీం రాంజీ అభిప్రాయపడ్డారు. వీటికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో హైదరాబాద్‌ను తమకు అనువైన చోటుగా ఎంచుకున్నామని తెలిపారు. తమ వినియోగదారులకు ప్రపంచస్థాయి సేవలను అందించటంతో పాటు ఏఐ, మొబైల్, క్లౌడ్ టెక్నాలజీలో ప్రతిభావంతులైన ఇంజనీర్లను అవకాశాలు కల్పించటం తమకు సంతోషంగా ఉందన్నారు.**

**ఈ-కబురు (హైదరాబాద్)**

: తెలంగాణకు మరో అంతర్జాతీయ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉంది. ప్రపంచంలోని ప్రఖ్యాత ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ 'వాన్‌గార్డ్' హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. వాన్‌గార్డ్ మన దేశంలో నెలకొల్పే తొలి జీసీసీ ఇదే కావటం విశేషం. జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డితో వాన్‌గార్డ్ ప్రతినిధి బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా జరిగిన చర్చల అనంతరం హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది.

వాన్‌గార్డ్ గ్రూప్ సీఈఓ సలీం రాంజీ , ఐటీ డివిజన్ సీఐఒ, ఎండీ నితిన్ టాండన్, చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ జాన్ కౌచర్ , జీసీసీ వాన్‌గార్డ్ ఇండియా హెడ్ వెంకటేష్ నటరాజన్ నేతృత్వంలో కంపెనీ ప్రతినిధి బృందం ఈ చర్చల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో ఉన్నారు.

ఈ ఏడాది చివరి నాటికి హైదరాబాద్‌లో జీసీసీ కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు వాన్‌గార్డ్ తెలిపింది. రాబోయే 4 సంవత్సరాల్లో 2,300 మంది ఉద్యోగులను నియమించుకోవాలని లక్ష్యంగా నిర్ణయించింది. వాన్‌గార్డ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా సుమారు 10 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆస్తులతో నిర్వహిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా 50 మిలియన్లకు పైగా పెట్టుబడిదారులకు సేవలు అందిస్తోంది. భాగ్యనగరంలో వాన్‌గార్డ్ ఏర్పాటు చేసే కేంద్రం ఇన్నోవేషన్ హబ్‌గా పనిచేయనుంది. (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) , డేటా అనలిటిక్స్, మొబైల్ ఇంజనీరింగ్ వంటి అధునాతన సాంకేతిక రంగాల్లో అందుకు అవసరమైన ఇంజనీర్లను తక్షణమే నియమించుకోవాలని ప్రణాళికను సిద్ధం చేస్తోంది.

హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటుకు వాన్‌గార్డ్ ముందుకు రావటం సంతోషకరమైన పరిణామంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జీసీసీ గమ్య స్థానంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. వాన్‌గార్డ్ రాకతో ప్రపంచ స్థాయిలో హైదరాబాద్ మరింత బలపడుతుందని అన్నారు. మన దేశంలోని ప్రతిభను ఉపయోగించుకోవడానికి, సాంకేతిక నిపుణులకు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుస్తుందని వివరించారు.

## ఎస్ఆర్‌హెచ్ హెచ్‌సీఏ వివాదం.. విజిలెన్స్ విచారణకు : సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**ఎస్ఆర్‌హెచ్-- , హెచ్‌సీఏ మధ్య పాసుల లొల్లి: సీఎం రేవంత్ రెడ్డి సీరియస్.. విజిలెన్స్ విచారణకు ఆదేశం**

**హైదరాబాద్:** కాంప్లిమెంటరీ పాసుల విషయంలో ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మధ్య నెలకొన్న వివాదంపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. పాసుల కోసం ఎస్ఆర్‌హెచ్ మేనేజ్మెంట్‌ను ఇబ్బంది పెట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, కాంప్లిమెంటరీ పాసుల కోసం హెచ్‌సీఏ తమను బెదిరింపులకు గురి చేసిందని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం సంచలన ఆరోపణలు చేసింది.

**సన్ రైజర్స్, హెచ్‌సీఏ మధ్య టికెట్ల గొడవ.. చిచ్చు పెట్టిన ఈ–మెయిల్**

పాసులు ఇవ్వకపోతే స్టేడియంలోని కొన్ని బాక్సులకు తాళాలు వేసి ఇబ్బందులు పెట్టారని ఆరోపించింది. ఇలాగైతే మా వల్ల కాదని.. మేం వేరే చోటుకు వెళ్లిపోతామని హెచ్‌సీఏకి లేఖ రాసింది ఎస్ఆర్‌హెచ్ మేనేజ్మెంట్. హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ మధ్య రాజుకున్న పాసుల వివాదం హాట్ టాపిక్‌గా మారడంతో దీనిపై సీఎంవో ఆరా తీసింది. ఈ మేరకు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని వేధింపులకు గురిచేసిన విషయంపై సీఎంఓ కార్యాలయం వివరాలు సేకరించింది. ఈ మేరకు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని పాసుల కోసం బెదిరించిన అంశంపై ప్రభుత్వం విజిలెన్స్ ఎంక్వయిరీకి ఆదేశించింది.

ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సీఏ వివాదంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా విజిలెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. చిల్లర వివాదాలతో ఎస్ఆర్‌హెచ్ మేనేజ్మెంట్ వేరే చోటుకి తరలివెళ్తే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇందులో భాగంగానే ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని ఇబ్బందులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరికలు జారీ చేశారు.





## ఫిలిప్పీన్స్ దేశానికి తెలంగాణ బియ్యం: కాకినాడ పోర్టులో ప్రారంభించిన మంత్రి ఉత్తమ

**8 లక్షల టన్నుల బియ్యం ఎగుమతికి ఒప్పందం – తొలి విడత ప్రారంభం**
**ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం ఎగుమతుల ప్రారంభం**
**కాకినాడ పోర్టు నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం రవాణా**

**ఈ-కబురు (కాకినాడ ):**

తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్ దేశానికి బియ్యం ఎగుమతి ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 8 లక్షల టన్నుల ఎంటీయూ 1010 రకం ముడి బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు ఫిలిప్పీన్స్ తో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. అగ్రిమెంట్లో భాగంగా 12 వేల 500 టన్నుల బియ్యాన్ని ఏపీలోని కాకినాడ పోర్టు నుంచి ఓ భారీ నౌక ద్వారా పంపించటానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఈ క్రమంలోనే.. 2025, మార్చి 31వ తేదీన తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాకినాడ పోర్టుకు వెళ్లి.. ఫిలిప్పిన్స్ దేశానికి తెలంగాణ బియ్యంతో వెళుతున్న నౌకను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బియ్యం ఎగుమతుల తీరును ఆయన పరిశీలించారు. తెలంగాణలో పోర్టులు లేకపోకపోవడంతో పొరుగు రాష్ట్రం ఏపీ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేస్తోంది తెలంగాణ సర్కార్.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. ఫిలిప్పీన్స్‌కి 8 లక్షల టన్నులు బియ్యం ఇవ్వడానికి ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ఒప్పందంలో భాగంగా తొలి విడతగా 12,500 టన్నుల బియ్యం పంపిస్తున్నామని చెప్పారు. ఇతర దేశాలకు కూడా బియ్యం ఎగుమతి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని.. ఈ మేరకు సంప్రదింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

తెలంగాణలో 280 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి జరుగుతుందని.. ఇందులో తెలంగాణ రేషన్ అవసరాలు తీరిన తర్వాత మిగిలిన వాటిని ఎగుమతి చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వాలు ఇటువంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. స్వయంగా నేనే వెళ్లి రైస్ ఎగుమతులపై ఇతర దేశాలతో చర్చిస్తానని తెలిపారు

## దేశ సంస్కృతి వటవృక్షం ఆరెస్సెస్

**సేవకు పర్యాయపదం ఆ సంస్థ**
**దాని వందేళ్ల తపస్సు ఫలాలందిస్తోంది**
**సంఘ్ ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ**
**నాగ్‌పుర్‌లో ఆదివారం హెడ్గేవార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రధాని మోదీ**

**ఈ-కబురు ,నాగ్‌పుర్:**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)ను దేశ అజరామర సంస్కృతి, ఆధునికీకరణ వటవృక్షంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. దేశ చైతన్యాన్ని పరిరక్షించడమే ఆ సంస్థ ఆదర్శాలు, మౌలికసూత్రాలని పేర్కొన్నారు. నేడు మనదేశం బానిస మనస్తత్వం, బానిస చిహ్నాలను వదిలించుకుంటోందని తెలిపారు. బానిస మనస్తత్వంతో రూపొందించిన శిక్షాస్మృతి స్థానంలో భారతీయ న్యాయ సంహితను తీసుకొచ్చామన్నారు.

11 ఏళ్ల క్రితం ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఆయన నాగ్‌పుర్‌లోని సంఘ్(ఆరెస్సెస్) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. తొలుత డా.హెడ్గేవార్ స్మృతి మందిరానికి వెళ్లిన ప్రధాని.. సంస్థ వ్యవస్థాపకుడు డా.కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, రెండో సర్‌సంఘ్‌చాలక్ ఎంఎస్ గోళ్వాల్కర్‌లకు నివాళులు అర్పించారు. అనంతరం స్మృతిభవన్‌లో ఆరెస్సెస్ పదాధికారులతో భేటీ అయి వారితో గ్రూప్‌ఫొటో దిగారు. అటుపై 1956లో డా.బీఆర్ అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన 'దీక్షభూమి'ని సందర్శించారు. అదేవిధంగా మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్‌కు శంకుస్థాపన చేశారు.

**నిస్వార్థసేవ మా సిద్ధాంతం: భాగవత్**

''భారత సంస్కృతి, ఆధునికీకరణ వటవృక్షం ఆరెస్సెస్. ఈ సంస్థ సేవకు పర్యాయపదం. సంఘ్ కార్యకర్తలు వివిధ రంగాల్లో నిస్వార్థంగా పనిచేస్తున్నారు. గత వందేళ్లలో ఆరెస్సెస్ చేసిన తపస్సు.. దేశం 'వికసిత్ భారత్' దిశగా సాగుతున్న తరుణంలో ఫలాలు ఇస్తోంది. రాజ్యాంగానికి 75 ఏళ్ల వేడుక వేళ.. ఆరెస్సెస్ వందేళ్లు పూర్తి చేసుకుంటోంది'' అని ప్రధాని మోదీ అన్నారు. సంఘ్ అధినేత మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. నిస్వార్థ సేవ అనేది తమ సిద్ధాంతమని తెలిపారు. ప్రజలకు సరైన ఆరోగ్య సౌకర్యాలు లేకపోవడం మంచిది కాదని, అందువల్ల.. మాధవ్ నేత్రాలయలో ఆరెస్సెస్ వాలంటీర్లు పేదలకు సేవలందిస్తున్నారని చెప్పారు.

**సంఘటిత భారతే అంబేడ్కర్‌కు నివాళి: మోదీ**

డా.బీఆర్ అంబేడ్కర్ 'దీక్షభూమి'ని సామాజిక న్యాయం, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించే చిహ్నంగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత కలలుగన్న దేశాన్ని సాకారం చేసేందుకు మరింత కష్టపడి పనిచేయాలనే ప్రభుత్వ నిబద్ధతను చాటిచెప్పారు. అభివృద్ధి చెందిన, సంఘటిత భారత్‌ను నిర్మించడమే.. అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అని తెలిపారు. మోదీ చివరిసారిగా 2017లో దీక్షభూమిని సందర్శించారు. అదే విధంగా అటల్ బిహారీ వాజ్‌పేయీ అనంతరం ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన రెండో సిట్టింగ్ ప్రధానిగా నిలిచారు. నాగ్‌పుర్‌లోని 'సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్' మందుగుండు సామగ్రి కేంద్రాన్నీ సందర్శించారు. అంతకు ముందు ప్రధాని మోదీకి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బావన్‌కులే విమానాశ్రయంలో స్వాగతం పలికారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్..

మొదటి పేజీ తరువాయి

మృత్యువాత పడ్డారు. ఈనెలలో రెండు భారీ ఎన్‌కౌంటర్‌లు జరుగగా.. దాదాపు 43 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. రెండు రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 17 మంది మావోయిస్టుల మృతిచెందారు. ఈనెల 29న (శనివారం) సుక్మా జిల్లా కెర్లపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొగుండ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్ట్‌లకు మధ్య ఎదురుకాల్పులు జరుగగా.. 17 మంది మావోలు చనిపోయారు. ఈ ఎన్‌కౌంటర్‌లో కీలక మావోయిస్టు నేత, దర్బా డివిజన్ కమిటీ కార్యదర్శి జగదీశ్ మరణించాడు. జగదీష్‌పై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డును ప్రకటించింది.

మృతుల్లో 11 మంది మహిళలు కూడా ఉన్నారు. ఘటనాస్థలి నుంచి ఏకే47 రైఫిల్స్, సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్, ఇన్సాస్ రైఫిల్, 303 రైఫిల్, రాకెట్ లాంఛర్లు, బ్యారెల్ గ్రనేడ్ లాంఛర్లు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఎదురు కాల్పుల్లో నలుగురు జవాన్లు కూడా గాయపడ్డారు. అంతకు ముందు మార్చి 20న కూడా భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ కాంకేర్ జిల్లాల్లో మావోలకు, భద్రతా బలగాలకు జరిగిన కాల్పుల్లో 26 మంది మావోయిస్టులు మరణించారు. ఈ మూడు నెలల్లో వేేరు చోట్ల జరిగిన ఎన్‌కౌంటర్లలో దాదాపు 130 మందికి పైగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు.



## రక్షణ ఉత్పత్తుల మళ్లింపు ఆరోపణలు..!

# ఖండించిన భారత్

**బ్రిటన్ కంపెనీ సరఫరా చేసిన రక్షణ పరికరాలను భారత ప్రభుత్వ రంగ సంస్థ రష్యాకు మళ్లించిందనే ఆరోపణలను సంబంధిత వర్గాలు ఖండించాయి.**

**ఈ-కబురు:** బ్రిటన్‌కు చెందిన ఓ ఏరోస్పేస్ కంపెనీని భారత రక్షణ సంస్థ తో ముడిపెట్టి.. ఆ రక్షణ సంస్థకు రష్యా ఆయుధ ఏజెన్సీతో సంబంధాలు ఉన్నాయంటూ 'న్యూయార్క్ టైమ్స్'లో వచ్చిన కథనాన్ని భారత్ ఖండించింది. ఆ నివేదిక అవాస్తవమని, తప్పుదోవ పట్టించేదిగా ఉందని స్పష్టం చేసింది. అందులో వాస్తవాలను తారుమారు చేశారని, రాజకీయ కోణంలో దాన్ని మలిచారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ''బ్రిటన్ కంపెనీ 'హెచ్‌ఆర్ స్మిత్ గ్రూప్'కు అనుబంధంగా ఉన్న ఓ సంస్థ.. 'హెచ్ఏఎల్'కు 2 మిలియన్ డాలర్ల విలువైన ట్రాన్స్‌మీటర్లు, కాక్‌పిట్ పరికరాలు, యాంటెన్నాలు, ఇతర సామగ్రిని సరఫరా చేసింది. 202324 మధ్యకాలంలో వీటిని చేరవేసింది. ఆ భారత సంస్థ.. రష్యా ఆయుధ ఏజెన్సీ కి అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ఆ ఉత్పత్తులను భారత సంస్థ రష్యా కంపెనీకి మళ్లించిందని చెప్పేందుకు ఆధారాల్లేవు. కానీ, కొన్ని సందర్భాల్లో బ్రిటన్ సంస్థ నుంచి పరికరాలు పొందిన రోజుల వ్యవధిలోనే.. అదే గుర్తింపు కోడ్‌లతో రష్యాకు తరలించినట్లు రికార్డుల్లో కనిపిస్తోంది'' అని న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది.

పుతిన్‌పై ట్రంప్ మండిపాటు..స్పందించిన రష్యా! అయితే, భారత్ దీన్ని ఖండించింది. ''కథనంలో ప్రస్తావించిన భారత కంపెనీ అన్ని అంతర్జాతీయ నిబంధనలు పాటించింది. వ్యూహాత్మక వాణిజ్యం విషయంలో దేశంలో బలమైన చట్టపరమైన నియంత్రణ వ్యవస్థ ఉంది. మీడియా సంస్థలు ఇటువంటి నివేదికలను ప్రచురించేటప్పుడు జాగ్రత్త వహించాలి'' అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, తమ విక్రయాలు చట్టబద్ధమైనవని హెచ్‌ఆర్ స్మిత్ గ్రూప్ సైతం తెలిపింది.

# పుతిన్‌పై ట్రంప్ మండిపాటు.. స్పందించిన రష్యా!

మొదటి పేజి తరువాయి

క్రెమ్లిన్ స్పందిస్తూ.. కీలక వ్యాఖ్యలు చేసింది. యుద్ధాన్ని ముగించే ప్రయత్నాలను సుదీర్ఘ ప్రక్రియగా పేర్కొంది. పుతిన్ ను ఉద్దేశించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై నేరుగా సమాధానం ఇవ్వనప్పటికీ.. అమెరికా అధ్యక్షుడితో మాట్లాడేందుకు తమ నేత ఎల్లప్పుడూ సిద్ధమేనని తెలిపింది.

''ఉక్రెయిన్ అంశానికి సంబంధించి కొన్ని ఆలోచనల అమలు విషయంలో కసరత్తు సాగుతోంది. యుద్ధం ముగింపు విషయంలో.. ప్రకటన వెలువరించేంత స్థాయిలో ఇంకేమీ జరగలేదు. విషయానికి ఉన్న సంక్లిష్టత దృష్ట్యా.. ఇదొక సుదీర్ఘ ప్రక్రియ'' అని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మీడియాతో చెప్పారు. అమెరికాతో సంప్రదింపుల విషయంలో పుతిన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ట్రంప్‌తో మాట్లాడేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

రక్తపాతం ఆగకపోతే పుతిన్‌దే బాధ్యత
ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలంటే జెలెన్‌స్కీ ప్రభుత్వం మారాలని ఇటీవల పుతిన్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ మండిపడ్డారు. ఉక్రెయిన్‌లో రక్తపాతం ఆగకపోతే.. ఆ బాధ్యత పుతిన్‌దేనని స్పష్టం చేశారు. అప్పుడు తాను రష్యాను ఉపేక్షించనని.. ఆ దేశంపై భారీ సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. అదేవిధంగా ఉక్రెయిన్ ఎప్పటికీ 'నాటో'లో సభ్య దేశం కాలేదని, అరుదైన ఖనిజాల ఒప్పందం నుంచి వైదొలగడానికి యత్నిస్తే జెలెన్‌స్కీ పెద్ద సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

# స్టాలిన్ ఉగాది పోస్ట్.. కన్నడ వాసుల ఆగ్రహం

మొదటి పేజి తరువాయి

బలవంతపు అమలు, డీలిమిటేషన్ వంటి భాషా, రాజకీయ ముప్పుల నేపథ్యంలో ప్రస్తుతం దక్షిణాది ఐకమత్యంతో ఉండటం అత్యవసరం. మన హక్కులు, గుర్తింపును అణగదొక్కే ప్రతి ప్రయత్నాన్ని మనమంతా కలిసి ఓడించాలి. ఈ ఉగాది మన ఐక్యతకు స్ఫూర్తిగా నిలవాలి'' అని స్టాలిన్ నిన్న పోస్ట్ పెట్టారు. అందరికీ ఉగాది శుభాకాంక్షలు అంటూ తెలుగు, కన్నడలో రాశారు.



అయితే, ఈ పోస్ట్ కాస్తా సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. కన్నడ ప్రజలను ద్రవిడులుగా సంభోదించడంపై కొంతమంది కన్నడిగులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ''డీలిమిటేషన్, బలవంతపు హిందీ అమలుపై మీతో కలిసి పోరాడేందుకు కన్నడిగులు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. కానీ, మేం ద్రవిడులం కాదు. అది గుర్తుపెట్టుకోండి. కన్నడ ద్రవిడ భాష కాదు'' అని కన్నడ పౌరులు కామెంట్లు చేస్తున్నారు. అటు, టీవీకే పార్టీ అధినేత, నటుడు విజయ్ కూడా దీనిపై స్పందిస్తూ స్టాలిన్‌పై విమర్శలు గుప్పించారు. డీఎంకే పార్టీ ద్రవిడ మోడల్ ముసుగులో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని దుయ్యబట్టారు.

# కంచ గచ్చిబౌలి భూముల వివాదం..

మొదటి పేజి తరువాయి

దాడి చేశారు. ఈ ఘటనలో మాదాపూర్ ఏసీపీకి గాయాలయ్యాయి. మొత్తం 53 మందిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించాం. సొంత పూచీకత్తుపై విడుదల చేశాం. అయితే, హెచ్‌సీయూకి సంబంధంలేని ఇద్దరు బయటి వ్యక్తుల్ని అరెస్టు చేశాం'' అని డీసీపీ వివరించారు.

## ప్రధాని మోదీకి ప్రైవేట్ సెక్రటరీగా నిధి తివారీ..

# ఆమె ఎవరంటే..?

**ప్రధాని మోదీకి ప్రైవేట్ సెక్రటరీగా ఐఎఫ్ఎస్ అధికారిణి నిధి తివారీ నియామకం అయ్యారు. త్వరలో ఆమె ఆ బాధ్యతలు చేపట్టనున్నారు.**

**ఈ-కబురు,ఢిల్లీ:**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రైవేట్ సెక్రటరీగా ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారిణి నిధి తివారీ నియామకమయ్యారు. కేంద్ర కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమె నియామకాన్ని ఆమోదించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ) ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది.

**ఇంతకీ ఎవరీమె..?**
వారణాసిలోని మెహమూర్‌గంజ్‌కు చెందిన నిధి తివారీ.. సివిల్ సర్వీసెస్ పరీక్షలో 96వ ర్యాంక్ సాధించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఈమె గతంలో వారణాసిలో అసిస్టెంట్ కమిషనర్ (వాణిజ్య పన్నులు) గా పని చేశారు. 2023 జనవరి 6 నుంచి ప్రధాన మంత్రి కార్యాలయంలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. తొలుత 2022లో ఆమె అండర్ సెక్రటరీగా చేరారు. పీఎంవోలో చేరడానికి ముందు నిధి తివారీ విదేశాంగ మంత్రిత్వశాఖలో పని చేశారు. ఆమె నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా వ్యవహారాల విభాగంలో బాధ్యతలు నిర్వర్తించారు. అంతర్జాతీయ సంబంధాల మెరుగుదలలో ఆమెకు ఉన్న నైపుణ్యమే పీఎంవోలో కీలకపాత్ర పోషించే స్థాయికి తీసుకొచ్చింది.



**జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌కు ఫారెన్ అండ్ సెక్యూరిటీకి చెందిన అంశాలను నేరుగా ఆయనకు నివేదించడంలో కీలకపాత్ర వహించారామె. ప్రస్తుతం డిప్యూటీ సెక్రటరీగా వ్యవహరిస్తున్న నిధి.. కొత్త బాధ్యతలను త్వరలో చేపట్టనున్నారు. అందుకు సంబంధించిన ఆదేశాలు త్వరలో వెల్లడించనున్నామని డీవోపీటీ ఒక ప్రకటనలో పేర్కొంది.**

# హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం విద్యార్థుల పోరాటం

మొదటి పేజి తరువాయి

యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పాటు పడుతున్న విద్యార్థులపైన ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమైన అణచివేతకు పాల్పడుతుందని కేటీఆర్ మండిపడ్డారు. యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు కేటీఆర్ తెలంగాణ భవన్‌లో కలిశారు. వారి పోరాటానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంఆ ఆయన మాట్లాడుతూ.. 'తొలి దశ తెలంగాణ ఉద్యమం తర్వాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం జరిగింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కాలక్రమంలో అనేక పేరు ప్రఖ్యాతలు సాధించుకుంది. అక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో గొప్ప సేవ చేస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దేశానికి తలమానికంగా ఉన్న విద్యాసంస్థల్లో ఒకటిగా ఉన్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ఎలాంటి స్వార్థం లేకుండా సమాజ హితం కోసం చేస్తున్న గొప్ప పోరాటం ఇది . హైదరాబాద్ నగర భవిష్యత్తు కోసం విశ్వవిద్యాలయ భవిష్యత్తు కోసం పడుతున్న ఆరాటం చాలా గొప్పది' అన్నారు.

**హెచ్‌సీయూ విద్యార్థులకు సెల్యూట్ చేస్తున్నాం..**
'ఈ మధ్య కొత్తతరం పిల్లల్లో విద్యార్థుల్లో పోరాట స్ఫూర్తి తగ్గిందని అప్పుడప్పుడు బాధపడతాం. కానీ, ఇలాంటి సరైన సందర్భంలో యూనివర్సిటీ విద్యార్థులు చూపెడుతున్న తెగువ, వారి పోరాటానికి సెల్యూట్ చేస్తున్నాం. ఇక్కడున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా కొన్ని ప్రశ్నలను విద్యార్థుల తరపున పార్టీ తరపున అడుగుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ విద్యార్థులపైన, యూనివర్సిటీ భూములపైన రాజకీయం చేస్తున్నది? వందల బుల్డోజర్లను, హిటాచి యంత్రాలను పెట్టి అక్కడున్న చెట్లను, జంతువులను, చంపి మరీ వేగంగా కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నది? ఎందుకు ఇంత వేగంగా భూముల కబ్జాకు ఆరాటపడుతున్నదో చెప్పాలి ? అంటూ డిమాండ్ చేశారు. గచ్చిబౌలి నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏరియాలో నగరం విస్తృతంగా పెరిగింది. ఒక కాంక్రీట్ జంగల్‌గా మారింది. భారత దేశంలోని ఏ నగరంలో అంత తక్కువ విస్తీర్ణంలో భారీగా నగరం అభివృద్ధి చెందలేదు. కోట్లాది చదరపు అడుగుల నివాస గృహాలు నిర్మాణం అవుతున్నాయి. పశ్చిమ హైదరాబాద్‌కి ఊపిరినిచ్చే కొన్ని గ్రీన్ ప్రాంతాలలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, దాని చుట్టూ ఉన్న ప్రాంతాలే. పశ్చిమ హైదరాబాద్‌లో భవిష్యత్తులో ఢిల్లీ మాదిరి ఊపిరి పీల్చుకోవడమే కష్టం అయ్యే పరిస్థితి ఏర్పడుతున్నది' అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

**భవిష్యత్‌కు కొత్త భరోసా**
'సెంట్రల్ యూనివర్సిటీ చుట్టూ ఉన్న హరితాన్ని అలాగే ఉంచితే భవిష్యత్తుకు కొంత భరోసా ఉంటుంది. ఒక ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ అనేది చేయకుండా ఏ విధంగా ఈ 400 ఎకరాలు అమ్ముతారని విద్యార్థులు అడుగుతున్నారు. ఈ 400 ఎకరాలను అమ్మేముందు జరిగే పర్యావరణ నష్టం ప్రభావంపై అధ్యయనం చేయాలి అని అడుగుతున్నారు. 2003లో ఐఎంజీ భారత అనే కంపెనీకి క్రీడా సదుపాయాల కోసం ఈ 400 ఎకరాలను కేటాయించింది. కేవలం స్టేడియాలు క్రీడా శిక్షణకు సంబంధించిన మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వాలు భూములను ఆ సంస్థకు ఇచ్చింది. కానీ ఈ ప్రభుత్వం అదే ప్రాంతంలో 400 ఎకరాలలో కోట్లాది చదరపు అడుగుల నిర్మాణాలు చేపట్టి కాంక్రీట్ జంగల్‌గా మార్చే ప్రయత్నం చేస్తున్నది.

21 సంవత్సరాల తర్వాత కేసు తేలింది. కానీ, ప్రభుత్వం మాత్రం వెంటనే ఆ భూములను అమ్మి రూ .30వేలకోట్లు సేకరించాలని ప్రయత్నం చేస్తుంది. రేవంత్ రెడ్డి ఆస్తులు అమ్మడం, అప్పులు తేవడం అనే ఎజెండాను ప్రజలు నిర్ణయిస్తారు. ఫ్యూచర్ సిటీ 50 వేల ఎకరాలలో కడతామని చెప్పి ప్రచారం చేసుకుంటున్నారు. ఫార్మాసిటీ భూములతో పాటు మరో 30 వేల ఎకరాలు సేకరించి నూతన నగరం కడతామంటున్నారు. ఇప్పటికే వేల ఎకరాల భూమి మీకు అందుబాటులో ఉన్నప్పుడు 45 వేల ఎకరాలను అమ్ముకునే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. 45వేల ఎకరాలు ప్రభుత్వానికి అందుబాటులో వచ్చే ఈ తరుణంలో 400 ఎకరాలపైన ఎందుకు ఇంత దారుణంగా దాష్టీకంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం సమాధానం చెప్పాలి' అంటూ డిమాండ్ చేశారు. అడ్డమొచ్చిన విద్యార్థులను ఆడబిడ్డలను లాగిపడేసి దుస్తులను చించి మరీ దుశ్శాసనుడి మాదిరి వ్యవహరించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెగబడుతున్నది అంటూ ధ్వజమెత్తారు.
బుల్డోజర్లు పెద్ద ఎత్తున హైదరాబాద్ యూనివర్సిటీలో మోహరించడంతో అక్కడే ఉన్న వన్యప్రాణులన్నీ అరుస్తున్నాయని.. అవి రాహుల్ గాంధీకి వినపడడం లేదా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఆయన విద్యార్థులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీకి సూటి ప్రశ్నలు వేశారు. హైకోర్టులో ఇప్పటికే ఈ అంశంపై పర్యావరణహితం కోసం ప్రజా ప్రయోజన రాజ్యం వేయడం జరిగిందని.. అయితే, ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల కన్నా ముందే అరాచకంగా వ్యవహరిస్తున్నది? మండిపడ్డారు.

**వన్య ప్రాణుల అరుపులు రాహుల్ గాంధీకి వినపడడం లేదా..? నిలదీసిన కేటీఆర్**
బుల్డోజర్లు పెద్ద ఎత్తున హైదరాబాద్ యూనివర్సిటీలో మోహరించడంతో అక్కడే ఉన్న వన్యప్రాణులన్నీ అరుస్తున్నాయని.. అవి రాహుల్ గాంధీకి వినపడడం లేదా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఆయన విద్యార్థులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీకి సూటి ప్రశ్నలు వేశారు. హైకోర్టులో ఇప్పటికే ఈ అంశంపై పర్యావరణహితం కోసం ప్రజా ప్రయోజన రాజ్యం వేయడం జరిగిందని.. అయితే, ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల కన్నా ముందే అరాచకంగా వ్యవహరిస్తున్నది? మండిపడ్డారు. ఎందుకు రాహుల్ గాంధీ స్పందించడం లేదని.. గతంలో రాహుల్ గాంధీ సెంట్రల్ యూనివర్సిటీకి రెండుసార్లు వచ్చి వెళ్లారని.. మరీ అలాంటిది విద్యార్థులపైన ఇన్ని అరాచకాలు జరుగుతున్న పర్యావరణంపైన ఇంత అక్రమంగా తమ సొంత ప్రభుత్వం వ్యవహరిస్తున్న ఎందుకు స్పందించడం లేదని మండిపడ్డారు. ఇదే రాహుల్ గాంధీ గతంలో ముంబయి ఆరాయి అడవులపై జాతీయస్థాయిలో మాట్లాడారని.. ఇదే రాహుల్ గాంధీ ఛత్తీస్‌గఢ్‌లో హస్దేయో అడవులను ఇతరులకు కేటాయించకుండా రాహుల్ గాంధీ మాట్లాడారన్నారు.

**అమ్ముకుంటే జాగలుండవని చెప్పింది రేవంత్ కాదా?**
ప్రభుత్వ ఆస్తులు అమ్ముకుంటే భవిష్యత్ తరాలకు శ్మశానాలకు కూడా జాగాలు ఉండవని అంటూ చెప్పింది రేవంత్ రెడ్డి కాదా? మరీ ఇప్పుడు అవన్నీ రేవంత్ రెడ్డి మర్చిపోయాడన్నారు. పిల్లలు ఇద్దరు యూనివర్సిటీ పిల్లలను అరెస్టు చేశారని, జైలుకి పంపించారని చెబుతున్నారు వారికి అండగా ఉంటామన్నారు. వాళ్లకి న్యాయపరంగా అన్ని రకాల సహకారం అందిస్తామన్నారు. ఆ ఇద్దరు విద్యార్థుల ఆచూకీని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టాలని.. మేరకు డీజీపీని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. వైస్ చాన్సెలర్ అనుమతులు లేకుండా పోలీసులు వెళ్తున్నారన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోకి వెళ్లే పోలీసులకు ఉండదని.. కానీ విచ్చలవిడిగా పోలీసులను పంపించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారన్నారు. ఆడ విద్యార్థినులను కూడా ఇబ్బందులు పెడుతున్నారని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ విద్యార్థులైన భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు లాంటి వాళ్లు ఈ అంశంలో ఎందుకు మాట్లాడట్లేదని.. వారికి పిల్లల తరపున నిలబడేందుకు మనసు రావడం లేదన్నారు. ఈ అంశంలో అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీజేపీతో పాటు ఇతర పార్టీలను కూడా డిమాండ్ చేస్తున్నామన్నారు.

# అదే జరిగితే.. అమెరికాపై ఎదురుదాడికి వెనకాడం: ఇరాన్ సుప్రీం లీడర్

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ తీవ్రంగా స్పందించారు. అమెరికా తమపై దాడులు చేస్తే ఎదురుదాడికి సిద్ధమని స్పష్టం చేశారు.**

**ఈ-కబురు:** అణ్వాయుధాల ఒప్పందం అంశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మండిపడింది. ఒకవేళ అగ్రరాజ్యం దాడులకు తెగబడితే ఎదురుదాడులు చేసేందుకు వెనకాడమని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్పష్టం చేశారు. ఈ మేరకు అంతర్జాతీయ కథనాలు పేర్కొన్నాయి.

''ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండిస్తోంది. అణు ఒప్పందానికి నిరాకరిస్తే బాంబు దాడులు చేస్తామని ఆయన బెదిరిస్తున్నారు. ఒకవేళ అమెరికా అదే పని చేస్తే ఇరాన్ నుంచి ఎదురుదాడులు తప్పవు'' అని హెచ్చరించారు. ట్రంప్ బెదిరింపులతో టెహ్రాన్ అప్రమత్తమైందని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్ వ్యాప్తంగా ఉన్న భూగర్భ ప్రయోగ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో క్షిపణులను లాంచ్‌ప్యాడ్‌లపై సిద్ధంగా పెట్టినట్లు వెల్లడించాయి.





అత్యవసర పరిస్థితుల్లో అమెరికా సంబంధిత ప్రాంతాలపై దాడులు చేసేందుకు వీటిని వినియోగించుకోనున్నట్లు తెలిపింది. కాగా.. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోకుండా అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఒప్పందం కుదుర్చుకోని పక్షంలో ఇరాన్‌పై బాంబు దాడులకూ వెనుకాడబోమని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దేశంపై మునుపెన్నడూ ఎరుగని రీతిలో ఇవి జరుగుతాయన్నారు. దాడులతో పాటు ఆ దేశంపై జరిమానాలు కూడా విధిస్తామని అన్నారు. ఈ నేపథ్యంలోనే స్పందించిన ఇరాన్ సుప్రీం లీడర్ అమెరికాపై ఎదురుదాడులు చేసేందుకు వెనకాడమని స్పష్టం చేశారు.

ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే 2018లో అణుఒప్పందం నుంచి అమెరికా వైదొలిగింది. ఆ సమయంలో ఇరాన్ అమెరికా సంబంధాలు సాధారణంగానే కొనసాగాయి. నాడు టెహ్రాన్‌పై అమెరికా ఆంక్షలు విధించింది. అప్పటి నుంచి ఎన్నోఏళ్లుగా జరిగిన పరోక్ష చర్చలు విఫలమయ్యాయి. మరోసారి అణుఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధమైన ట్రంప్.. ఇరాన్ వినని పక్షంలో దాడులు తప్పవంటూ హెచ్చరికలు చేశారు.

# దూసుకెళ్తున్న బంగారం..

## మళ్లీ భారీగా.. కొత్త మార్క్‌కు..

**దేశంలో బంగారం ధరలు ఆగకుండా దూసుకెళ్తున్నాయి. గత ఐదు రోజులుగా వరుసగా పెరుగుతూ పోతున్న పసిడి ధరలు నేడు మళ్లీ భారీగా ఎగిసి కొత్త మార్క్‌ను తాకాయి. దీంతో కొనుగోలుదారులకు మరింత నిరుత్సాహం తప్పలేదు.**



బంగారం ధరలు ద్రవ్యోల్బణం, గ్లోబల్ ధరలలో మార్పు, సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్, హెచ్చుతగ్గుల వడ్డీ రేట్లు, నగల మార్కెట్‌లతో సహా అనేక అంతర్జాతీయ కారకాలపై ఆధారపడి ఉంటాయి. నేటి బంగారం ధరలు ఏయే ప్రాంతాల్లో ఎలా ఉన్నాయనేది ఈ కథనంలో తెలుసుకుందాం.

**ఇతర ప్రాంతాల్లో..**
దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.92,060 వద్ద, 22 క్యారెట్ల పసిడి ధర రూ.84,400 వద్ద ఉన్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు రూ.710, రూ.650 చొప్పున పెరిగాయి.

చెన్నైలో బంగారం ధరల విషయానికి వస్తే.. ఇక్కడ 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 84,250 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 91,910 వద్దకు చేరాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు రూ.650, రూ.710 చొప్పున పెరిగాయి. బెంగళూరు, ముంబై ప్రాంతాల్లోనూ ఇవే ధరలు ఉన్నాయి.

**వెండి ధరలు**
దేశవ్యాప్తంగా వెండి ధరల్లో నేడు ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి కేజీ రూ.1,13,000 వద్ద, ఢిల్లీలో రూ. 1,04,000 వద్ద కొనసాగుతోంది.



### తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు

**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు వంటి ప్రాంతాల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 84,250 వద్ద, 24 క్యారెట్ల పసిడి రేటు రూ. 91,910 వద్ద ఉన్నాయి. నిన్నటితో పోలిస్తే వీటి ధరలు ఏకంగా రూ.650, రూ.710 చొప్పన ఎగిశాయి.**

# వొడాఫోన్‌లో ప్రభుత్వ వాటా అప్

**రూ. 36,950 కోట్ల విలువైన షేర్లు జారీ**
**49 శాతానికి బలపడనున్న ప్రభుత్వ వాటా**

**న్యూఢిల్లీ:** రుణ భారంతో కుదేలైన మొబైల్ టెలికం దిగ్గజం వొడాఫోన్ ఐడియాలో తాజాగా ప్రభుత్వం రూ. 36,950 కోట్ల విలువైన షేర్లను సొంతం చేసుకోనుంది. దీంతో కంపెనీలో ప్రభుత్వ వాటా 48.99 శాతానికి బలపడనున్నట్లు వొడాఫోన్ ఐడియా తాజాగా పేర్కొంది. ఇప్పటికే కంపెనీలో 22.6 శాతం వాటాతో ప్రభుత్వం అతిపెద్ద వాటాదారుగా నిలుస్తోంది.

ప్రమోటర్లుగా కంపెనీలో వొడాఫోన్ గ్రూప్ 14.76 శాతం, ఆదిత్య బిర్లా గ్రూప్ 22.56 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయి. తాజా పెట్టుబడులతో ప్రభుత్వం ప్రమోటర్ల సంయుక్త వాటాను సైతం అధిగమించనుంది.

కమ్యూనికేషన్ల శాఖ 2021 సెప్టెంబర్‌లో ప్రకటించిన టెలికం రంగ సహాయక ప్యాకేజీలో భాగంగా ప్రభుత్వం రూ. 36,950 కోట్లను ఈక్విటీ షేర్లుగా మార్పిడి చేసుకుంటున్నట్లు వొడాఫోన్ ఐడియా తాజాగా వెల్లడించింది. వెరసి కంపెనీ 30 రోజుల్లోగా ప్రభుత్వానికి 3,695 కోట్ల ఈక్విటీ షేర్లు జారీ చేయనుంది. 2026కల్లా వొడాఫోన్ ఐడియా చెల్లించవలసిన స్పెక్ట్రమ్, స్థూల ఆదాయ సర్దుబాటు (ఏజీఆర్) విలువ రూ. 32,724 కోట్లుకాగా.. ప్రభుత్వానికి తాజాగా ఈక్విటీ జారీ చేయనుంది.



# యాపిల్‌పై రూ.1,350 కోట్లు జరిమానా

**ప్రపంచ దిగ్గజ సంస్థ యాపిల్ యాప్ ట్రాకింగ్ ప్రైవసీ ఫీచర్ కంపెనీ ప్రకటించిన లక్ష్యానికి అనుగుణంగా లేదని ఫ్రెంచ్ యాంటీట్రస్ట్ అధికారులు 150 మిలియన్ యూరోలు (సుమారు రూ.1,350 కోట్లు) జరిమానా విధించారు. ఇతర యూరోపియన్ దేశాలు కూడా ఈమేరకు జరిమానా విధించాలనే పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తుంది.**

యాపిల్ యాప్ ట్రాకింగ్ ట్రాన్స్‌పరెన్సీ (ఏటీటీ) సాఫ్ట్‌వేర్‌ను అమలు చేసిన విధానం.. వినియోగదారు డేటాను రక్షించేలా కంపెనీ ప్రకటించిన లక్ష్యానికి అనుగుణంగా లేదని ఫ్రెంచ్ యాంటీట్రస్ట్ అధికారులు తెలిపారు. దాంతో థర్డ్ పార్టీ పబ్లిషర్‌గా ఉన్న యాపిల్‌పై జరిమానా విధించారు. దీంతోపాటు యాపిల్ తన నిర్ణయాన్ని ఏడు రోజుల్లో తన వెబ్‌సైట్‌లో ప్రచురించాల్సి ఉంటుంది. జర్మనీ, ఇటలీ, రొమేనియా, పోలాండ్ అధికారులు కూడా వినియోగదారుల గోప్యతకు సంబంధించి యాపిల్ ప్రమోట్ చేసే ఏటీటీపై దర్యాప్తు ప్రారంభించారు.

**నిరాశకు గురయ్యాం: యాపిల్**
ఫ్రెంచ్ అధికారులు తీసుకున్న నిర్ణయంతో తాము నిరాశకు గురయ్యామని, ఫ్రెంచ్ కాంపిటీషన్ అథారిటీ ఏటీటీలో ఎలాంటి నిర్దిష్ట మార్పులు సూచించాల్సిన అవసరం లేదని యాపిల్ ఒక ప్రకటనలో తెలిపింది. 2021లో యాపిల్ ప్రవేశపెట్టిన ఈ ఫీచర్‌ను ఇతర అప్లికేషన్లు, వెబ్‌సైట్‌లో కార్యకలాపాలను ట్రాక్ చేయడానికి ఉపయోగిస్తారు. ఇందుకోసం ముందుగా పాప్‌అప్ విండో ద్వారా యూజర్లు అనుమతివ్వాల్సి ఉంటుంది. అది నిరాకరిస్తే యాప్ ఆ వినియోగదారునికి సంబంధించిన సమాచారాన్ని ట్రాక్ చేయదు. ఈ క్రమంలో యూజర్లకు టార్గెట్ యాడ్స్ వస్తున్నట్లు అధికారులు ఆరోపించారు. యాడ్ విభాగంలో పోటీదారులను పరిమితం చేస్తూ యాపిల్ తన సొంత ప్రకటనల సేవలను ప్రోత్సహించడానికి ఈ వ్యవస్థను ఉపయోగిస్తోందని చెబుతున్నారు.

**ప్రైవసీపై మరింత నియంత్రణ**
ఏటీటీ ఫీచర్ ఐఫోన్లు, ఐప్యాడ్లలో థర్డ్ పార్టీ యాప్స్ కోసం అధిక సంఖ్యలో పర్మిషన్ విండోలు వచ్చేలా చేస్తుందని ఫ్రాన్స్ కాంపిటీషన్ అథారిటీ తన నిర్ణయంలో పేర్కొంది. ఈ ఫీచర్ యాడ్ పబ్లిషర్లు, యాడ్ సర్వీస్ ప్రొవైడర్లకు ఆర్థిక నష్టాన్ని కలిగిస్తుందని తెలిపింది. యాపిల్ అనుసరిస్తున్న విధానం చిన్న ప్రచురణకర్తలను ప్రభావితం చేస్తుందని, వారు తమ వ్యాపారాలకు నిధులు సమకూర్చడానికి థర్డ్ పార్టీ డేటా సేకరణపై ఎక్కువగా ఆధారపడేలా ఉందని అథారిటీ పేర్కొంది

# మరో ఆరు నెలల్లో దేశీయ తొలి మైక్రోకంట్రోలర్

**దేశీయంగా రూపొందిస్తున్న తొలి కమర్షియల్ మైక్రోకంట్రోలర్‌ను మరో ఆరు నెలల్లో ఆవిష్కరించే అవకాశం ఉందని చెన్నైకి చెందిన మైండ్ గ్రోవ్ టెక్నాలజీస్ సంస్థ సహ వ్యవస్థాపకులు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ టీఆర్ శశ్వత్ తెలిపారు. ఇప్పటికే దీనికి సంబంధించి ప్రోటోటైపింగ్ పూర్తి చేసి టెస్టింగ్ తర్వాత అవసరమైన డిజైన్ మార్పులు చేసినట్లు చెప్పారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ఏడాది సెప్టెంబర్-అక్టోబర్ నాటికి చిప్‌ను లాంచ్ చేయాలనుకుంటున్నట్లు స్పష్టం చేశారు.**



స్మార్ట్ వాచ్‌లు, హెడ్ ఫోన్‌లు, కనెక్టెడ్ హోమ్ డివైజెస్ (స్మార్ట్ లాక్‌లు, స్పీకర్లు, స్మార్ట్ ఫ్యాన్‌లు), స్మార్ట్ సిటీ పరికరాలు (విద్యుత్, నీరు, గ్యాస్ మీటర్లు), యాక్సెస్ కంట్రోల్ పరికరాలు (బయోమెట్రిక్స్), థర్మల్ ప్రింటర్లు, పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాలు వంటి పరికరాల్లో ఈ మైక్రోకంట్రోలర్లను ఉపయోగించనున్నారు. ఇది నిర్దిష్ట పరికరాలు లేదా అవి చేసే పనులను నియంత్రించడానికి రూపొందిస్తున్నారు.

మైక్రో కంట్రోలర్లు అవసరమయ్యే కంపెనీలతో సంస్థ ఒప్పందాలను ఖరారు చేసిన తర్వాత ఏమేరకు ఉత్పత్తి చేయాలో నిర్ణయిస్తామని శశ్వత్ తెలిపారు. హైపెర్ఫార్మెన్స్ ఎడ్జ్ కంప్యూటింగ్, వీడియో ప్రాసెసింగ్ అప్లికేషన్ల కోసం ఈ మైక్రో కంట్రోలర్లను ఉపయోగిస్తున్నారని చెప్పారు. సీసీటీవీ కెమెరాలు, వీడియో రికార్డర్లు, ఎలక్ట్రానిక్ ఆటోమోటివ్ పరికరాలు, స్మార్ట్ టీవీలు.. వంటి డివైజ్‌ల్లో ఈ చిప్‌లను వాడబోతున్నట్లు పేర్కొన్నారు. డిజైన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ కింద చిప్ అభివృద్ధికి ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నుంచి గత ఏడాది సెప్టెంబర్‌లో అనుమతి లభించిందన్నారు.

## బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా పీఎం విద్యా లక్ష్మీ రుణాలు

**న్యూఢిల్లీ:** ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన్ మంత్రి విద్యాలక్ష్మీ (పీఎం-విద్యాలక్ష్మీ) పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. దేశంలోని టాప్ 860 నాణ్యమైన ఉన్నత విద్యా సంస్థల్లో (క్యూహెచ్ ఈఐ) ప్రవేశం పొందిన విద్యార్థులు ఈ పథకం కింద రుణం కోసం అర్హులు. రూ.7.5 లక్షల వరకు రుణాలకు 75% క్రెడిట్ గ్యారంటీ కూడా ఉంటుంది. విద్యార్థులు లేదా వారి కుటుంబాలు ఎటువంటి ఆస్తులను తనఖాగా ఇవ్వాల్సిన అవసరం లేదు. దరఖాస్తుదారులు పీఎం-విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా బ్యాంక్ ఆఫ్ బరోడా నుండి విద్యా రుణం కోసం డిజిటల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాంక్‌కు 8,300కి పైగా బ్రాంచ్‌లు, 12 ప్రత్యేక విద్యా రుణ ఆమోద కేంద్రాలు, 119 రిటైల్ అస్సెట్ ప్రాసెసింగ్ కేంద్రాలు ఉన్నాయి. అర్హులైన విద్యార్థులందరూ నాణ్యమైన విద్య పొందేందుకు అవసరమైన ఆర్థిక తోడ్పాటు అందించడం తమ లక్ష్యమని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ ముదలియార్ తెలిపారు.

# స్టాక్ మార్కెట్ సెలవులు.. ఏప్రిల్‌లో ఈ రోజుల్లో నో ట్రేడింగ్

**ఇటీవలి రోజుల్లో స్టాక్ మార్కెట్లపై జనంలో ఆసక్తి పెరిగింది. చాలా మంది మార్కెట్ పెట్టుబడుల వైపు వస్తున్నారు. దీంతో రోజువారీ ట్రేడింగ్‌ను గమనించేవారి సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు ఏయే రోజులు పనిచేస్తాయి.. సెలవులు ఎప్పుడెప్పుడు ఉంటాయన్నది ఈ కథనంలో తెలుసుకుందాం..**

### అదనపు సెలవులు

- ఏప్రిల్ 10 మహావీర్ జయంతి
- ఏప్రిల్ 14 డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి
- ఏప్రిల్ 18 గుడ్ ఫ్రైడే

**వారాంతపు సెలవులు**

- ఏప్రిల్ 5 శనివారం
- ఏప్రిల్ 6 ఆదివారం
- ఏప్రిల్ 12 శనివారం
- ఏప్రిల్ 13 ఆదివారం
- ఏప్రిల్ 19 శనివారం
- ఏప్రిల్ 20 ఆదివారం
- ఏప్రిల్ 26 శనివారం
- ఏప్రిల్ 27 ఆదివారం



ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) సందర్భంగా ఈరోజు (2025 మార్చి 31 సోమవారం) భారత స్టాక్ మార్కెట్‌కు సెలవు. మూడు రోజుల వారాంతం తర్వాత 2025 ఏప్రిల్ 1 మంగళవారం ట్రేడింగ్ పునఃప్రారంభమవుతుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ), బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) రెండూ ఈరోజు స్టాక్స్, డెరివేటివ్స్, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ లోన్ (ఎస్ఎల్బీ) విభాగాల్లో ట్రేడింగ్, సెటిల్మెంట్‌కు తెరిచి ఉండవు.

అయితే 2025 మార్చి 31న మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్) మాత్రం పాక్షికంగా తెరిచి ఉంటుంది. సాయంత్రం సెషన్ సాయంత్రం 5 గంటల నుండి 11:30 / 11:55 గంటల వరకు నడుస్తుంది. దీనికి విరుద్ధంగా, భారతదేశపు అతిపెద్ద వ్యవసాయ కమోడిటీ ఎక్స్ఛేంజ్ అయిన నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌సీడీఈఎక్స్) ఈరోజు పూర్తిగా మూసి ఉంటుంది.

**ఏప్రిల్‌లో స్టాక్ మార్కెట్ సెలవులు**
పండుగలు, విశేష దినోత్సవాలు, వారాంతపు సెలవులతో కలుపుకొని ఏప్రిల్ నెలలో స్టాక్ మార్కెట్లు మొత్తంగా 11 రోజులు మూసిఉంటాయి. ఆయా రోజుల్లో స్టాక్ ఎక్స్ఛేంజీలు ట్రేడింగ్‌కు అందుబాటులో ఉండవు. సెలవు రోజులు ఇవే..

# కొత్త లోన్ రూల్.. రేపటి నుంచే..

**ఎడాపెడా అప్పులు చేసే ధోరణిని కట్టడి చేసే కొత్త నిబంధన ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వస్తోంది. దేశ రుణ వితరణ వ్యవస్థను మార్చే ఈ నియమం మూడు కంటే ఎక్కువ రుణదాతల (బ్యాంకులు లేదా ఫైనాన్స్ సంస్థలు) నుండి రుణాలు తీసుకోకుండా రుణగ్రహీతలను కట్టడి చేస్తుంది. అధిక వినియోగాన్ని అరికట్టడం, బాధ్యతాయుతమైన రుణాలను ప్రోత్సహించడమే ఈ నిబంధన లక్ష్యం.**

**ఎందుకీ నిబంధన?**
మైక్రోఫైనాన్స్ రంగం అణగారిన వర్గాల సాధికారతలో కీలక పాత్ర పోషించినప్పటికీ, రుణగ్రహీతలు బహుళ వనరుల నుండి రుణాలు పొందడం చూసింది. ఇది నిర్వహణకు సాధ్యంకాని రుణానికి దారితీస్తుంది. ఈ మితిమీరిన వినియోగం, కొన్ని సంస్థల దూకుడు రుణ విధానాలు వ్యవస్థలో బలహీనతలను సృష్టించాయి. రుణగ్రహీతలను మూడు రుణదాతలకు పరిమితం చేయడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించాలని, డిఫాల్టర్ల ప్రమాదాన్ని తగ్గించాలని భావిస్తున్నారు.

**రుణగ్రహీతలపై తక్షణ ప్రభావం**
ప్రస్తుతం మూడు కంటే ఎక్కువ సంస్థల్లో రుణాలు తీసుకుంటున్న 45 లక్షల మంది రుణగ్రహీతలకు, ఈ నియమం సవాలుగా మారుతుంది. వీరు తరచుగా వర్కింగ్ క్యాపిటల్, అత్యవసర అవసరాలు లేదా రోజువారీ మనుగడ కోసం అతివ్యాప్త రుణాలపై ఆధారపడతారు. మూడు బ్యాంకుల పరిమితితో, రుణగ్రహీతలు లిక్విడిటీ కొరతను ఎదుర్కోవచ్చు.







ఇది వారి ఆర్థిక వ్యూహాలను పునఃసమీక్షించుకునేలా, ఖర్చులను తగ్గించుకునేలా చేస్తుంది. అంతేకాదు క్రెడిట్ మదింపులు కఠినంగా మారతాయి. ముఖ్యంగా అధికరిస్క్ గా భావించే రుణగ్రహీతలకు రుణ తిరస్కరణలు పెరగవచ్చు. ఇది కొంతమందిని అధిక వడ్డీలు ఉండే అనధికారిక రుణ మార్గాలవైపు నెట్టవచ్చు.

### రుణదాతలకూ సవాళ్లు..

**కొత్త రూల్ రుణదాతలకూ అనేక సవాళ్లను కలిగిస్తుంది. మైక్రోఫైనాన్స్ సంస్థలు తమ పోర్ట్‌ఫోలియో వ్యూహాలను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. దీంతో స్వల్పకాలంలో వారి కస్టమర్ బేస్ ఎంతో కొంత కోల్పోయే అవకాశం ఉంది. అంతేకాక, సంస్థలు రుణ వితరణ విషయంలో మరింత క్షుణ్ణమైన ప్రక్రియలను పెంపొందించుకోవాలి. రుణగ్రహీతలు మూడు-రుణదాతల పరిమితిని మించకుండా చూసుకోవాలి. ఇందుకోసం బలమైన వ్యవస్థలు, సమన్వయం అవసరమవుతాయి.**
**వాస్తవానికి ఈ నిబంధన జనవరి 1 నుంచి అమల్లోకి రావాల్సి ఉండగా, సజావుగా జరిగేందుకు ఏప్రిల్ 1కి వాయిదా పడింది. ఈ జాప్యం వాటాదారులకు సన్నద్ధం కావడానికి సమయం అందించినప్పటికీ, రుణగ్రహీతలు, రుణదాతలు ఈ ముఖ్యమైన మార్పుకు ఎలా అలవాటు పడతారనేదే అసలైన పరీక్ష.**




## ప్రదీప్ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' ట్రైలర్ చూశారా?

తెలుగులో కొన్నేళ్ల పాటు పాపులర్ యాంకర్ గా కొనసాగిన ప్రదీప్ మాచిరాజు.. 30 రోజుల్లో ప్రేమించడం ఎలా? అనే సినిమాలో గతంలో హీరోగానూ నటించాడు. కానీ హిట్ కొట్టలేకపోయాడు. ఇప్పుడు యాంకరింగ్ ని పక్కనబెట్టి మరో మూవీలో హీరోగా నటించాడు. అదే 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు.

ట్రైలర్ బట్టి చూస్తుంటే సివిల్ ఇంజినీరింగ్ చేసిన ఓ కుర్రాడు.. ఊహించని విధంగ ఓ పల్లెటూరికి వెళ్తాడు. ఆ ఊరిలో ఎలాంటి అనుభవాలు ఎదుర్కొన్నాడు? ఇందులో హీరోయిన్ పాత్రేంటి? అనేది మిగతా స్టోరీలా అనిపిస్తుంది.

ట్రైలర్ లో కామెడీ పర్లేదనేలానే ఉంది. ఏప్రిల్ 11న సినిమాను థియేటర్లలో రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రదీప్ సరసన దీపిక పిల్లి హీరోయిన్ కాగా.. నితిన్-భరత్ దర్శకులుగా పరిచయమవుతున్నారు. మరి ఈ సారైనా ప్రదీప్ హిట్ కొడతాడేమో చూడాలి?

## రూ.60 కోట్ల బడ్జెట్.. రూ.10 కోట్లు కూడా రాలేదు.... ఓటీటీలో ఖుషీకపూర్ లేటెస్ట్ మూవీ




ఖుషీకపూర్, జునైద్‌ఖాన్ కీలక పాత్రల్లో నటించిన 'లవ్‌యాపా' ఓటీటీలో స్ట్రీమింగ్ రెడీ అయింది. సోదరి జాన్వీకపూర్ బాటలో నడుస్తూ ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో అడుగులు వేస్తోంది ఖుషీకపూర్. ఇప్పటివరకూ చేసింది మూడు సినిమాలే అయినా, ఒక్కటీ విజయం సాధించలేదు. అయినా పట్టు వదలకుండా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఇటీవల అద్వైన్ చందన్ దర్శకత్వంలో జునైద్‌ఖాన్‌తో కలిసి ఆమె నటించిన రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ 'లవ్‌యాపా'. ఫిబ్రవరిలో 7న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. రూ.60 కోట్ల బడ్జెట్‌తో ఈ మూవీని తీస్తే, పట్టుమని రూ.10కోట్లు కూడా రాలేదు. ప్రదీప్ రంగనాథన్ స్వీయ దర్శకత్వంలో తమిళంలో సూపర్‌హిట్ అందుకున్న చిత్రం 'లవ్‌టుడే' కు రీమేక్‌గా దీనిని రూపొందించారు. తమిళ, తెలుగు భాషల్లో మంచి విజయాన్ని అందుకున్న ఆ మూవీ హిందీ ప్రేక్షకులను మాత్రం మెప్పించలేకపోయింది. ముఖ్యంగా నటన, దర్శకత్వం ఏ విషయంలోనూ సినిమా మెప్పించలేకపోయింది. ఇప్పుడు ప్రముఖ ఓటీటీ జియోహాట్‌స్టార్ వేదికగా ఏప్రిల్ 4వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది.

ఇదీ కథ: ఐటీ ఉద్యోగి అయిన గౌరవ్ సచ్‌దేవ్ (జునైద్ ఖాన్), బానీ శర్మ (ఖుషీకపూర్) ప్రేమించుకుంటారు. గాఢమైన ప్రేమలో మునిగి తేలుతున్న ఆ ఇద్దరూ పెళ్లితో ఒక్కటి కావాలనుకుంటారు. ఇంతలోనే ఆ జంట ప్రేమ విషయం బానీ శర్మ ఇంట్లో తెలుస్తుంది. ఆమె తండ్రి అతుల్‌కుమార్ (అశుతోష్ రాణా) ఒకసారి గౌరవ్‌ని ఇంటికి తీసుకురమ్మని చెబుతాడు. ఇద్దరి ప్రేమని అంగీకరిస్తాడు. అయితే.. ఓ షరతు విధిస్తాడు. ఒక రోజంతా ఒకరి ఫోన్‌ని మరొకరు మార్చుకోవాలనేది ఆ షరతు. ఒకరి ఫోన్లు మరొకరు చూసుకున్నాక కూడా ఆ జంట పెళ్లికి సిద్ధమైందా? తన ప్రేయసి ఫోన్లో అబ్బాయిలతో సందేశాలు చూశాక గౌరవ్ ఎలా స్పందించాడు? గౌరవ్ ఫోన్‌లో యాప్స్, ఇతర సందేశాలు చూశాక బానీ పరిస్థితి ఏమిటి? ఆ ఇద్దరూ ఫోన్లు మార్చుకున్నాక ఎలాంటి సమస్యలు తలెత్తాయి? చివరికి ఇద్దరికీ పెళ్లైందా? లేదా? అన్నది చిత్ర కథ.

## 'జయం'.. రష్మీతోనే 90% రిహార్సల్స్.. కానీ చివర్లో..

**ఫస్ట్ సినిమాతోనే సూపర్ హిట్ కొట్టి అందరి దృష్టినీ ఆకర్షించాడు నితిన్ . ఇతడు హీరోగా నటించిన తొలి చిత్రం జయం . తేజ దర్శకత్వం వహించి నిర్మించిన ఈ మూవీలో గోపీచంద్ విలన్‌గా నటించాడు. సదా హీరోయిన్‌గా పరిచమైంది. అయితే ఈ సినిమాలో మొదట సదాని కథానాయికగా అనుకోలేదట!**



**రష్మీతోనే రిహార్సల్స్ చేశా..**
హీరో నితిన్ తాజాగా ఈ విషయాన్ని వెల్లడించాడు. ఉగాది ఈవెంట్‌కు హాజరైన అతడు జయం సినిమా గురించి కొన్ని విషయాలు చెప్పుకొచ్చాడు. జయం సినిమాకు రష్మీ గౌతమ్ తో కలిసి రిహార్సల్స్ చేసినట్లు తెలిపాడు. దాదాపు 90 శాతం సీన్లు రష్మీతో రిహార్సల్స్ చేశానని, చివర్లో ఏమైందో ఏమో కానీ హీరోయిన్‌ను మార్చేశారు అని పేర్కొన్నాడు.

**బుల్లితెరపై సెటిలైన రష్మీ**
ఒకవేళ రష్మీ గనక హీరోయిన్‌గా జయం సినిమా చేసుంటే అప్పట్లోనే స్టార్ అయిపోయేది. పేరుప్రఖ్యాతలతో పాటు మంచి అవకాశాలు వచ్చేవి. ఇండస్ట్రీలో అవకాశాల కోసం ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఈ క్రమంలో బోల్డ్ సినిమాల్లోనూ యాక్ట్ చేసింది. కానీ అవేవీ వర్కవుట్ కాకపోవడంతో బుల్లితెరపై సెటిల్ అయింది. గతంలో యువ సీరియల్‌లో నటించిన ఆమె ప్రస్తుతం కామెడీ షోలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోంది.

**సినిమా**
నితిన్ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ రాబిన్‌హుడ్. శ్రీలీల కథానాయిక. వెన్నెల కిశోర్, రాజేంద్రప్రసాద్ ముఖ్య పాత్రలు పోషించారు. ఆస్ట్రేలియన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అతిథి పాత్రలో కనిపించాడు. మైత్రీమూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు వచ్చింది.





## 6 నెలలు గడిచినా ఇంకా కోలుకోలేదు

**తనకు అయిన గాయం నుంచి ఇంకా కోలుకోలేదన్నారు నటి రకుల్ ప్రీత్ సింగ్.**

గతేడాది అక్టోబర్‌లో నటి రకుల్ ప్రీత్ సింగ్ గాయపడిన విషయం తెలిసిందే. జిమ్‌లో వర్క్‌వుట్ చేస్తోన్న సమయంలో ఆమెకు గాయమైంది. 6 నెలలు గడిచినప్పటికీ దానినుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదని తాజాగా ఆమె చెప్పారు. గాయం తనకు ఎన్నో విషయాలు నేర్పిందన్నారు.

లాక్మే ఫ్యాషన్ వీక్‌లో పాల్గొన్న రకుల్ తన ఆరోగ్యం గురించి మాట్లాడారు. "జిమ్‌లో గాయం నాకో ఎదురుదెబ్బ. ఇప్పటికీ సరైన స్థితిలోకి రాలేదు. అప్పటికంటే కాస్త మెరుగు అయినప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. చాలా విషయాల్లో జాగ్రత్తలు పాటిస్తున్నాను. అన్నీ మనం అనుకున్నట్లే జరుగుతాయని అనుకున్నా ఒక్కోసారి కొన్ని విషయాల్లో ఆచితూచి అడుగులు వేయడం మంచిది. గాయాన్ని నేను మొదట నిర్లక్ష్యం చేశాను. చికిత్స తీసుకోవాలని నిర్ణయించుకునే సమయానికే దాని తీవ్రత ఎక్కువైంది. గాయం నుంచి కోలుకోవాలంటే చాలా రోజులు పడుతుందని వారం రోజులకు అర్థమైంది. ధైర్యంగా దాన్ని నుంచి కోలుకుంటున్నాను. నా వర్క్‌లో బిజీ అవుతున్నాను" అని చెప్పారు.

వ్యాయమం చేస్తూ 80 కేజీల బరువు ఎత్తే క్రమంలో రకుల్‌కు గాయమైంది. దీనిపై ఎన్నో సందర్భాల్లో ఆమె మాట్లాడారు. శరీరం ఇచ్చే సంకేతాలను పట్టించుకోవడం ఎంతో అవసరం అని తెలిపారు. ఇక సినిమాల విషయాకొస్తే.. ప్రస్తుతం ఆమె 'ఇండియన్ 3', 'దే దే ప్యార్ దే

## ప్రమోషన్‌కు రూ.3 కోట్లు.. అలాంటివి మాకక్కర్లేదు



**బెట్టింగ్ యాప్స్ .. ముందు నమ్మిస్తాయి, తర్వాత ముంచేస్తాయి. అది తెలియని అమాయకులు.. అన్ని కష్టాలకు ఒకే ఒక్క పరిష్కారం ఇదేనంటూ బెట్టింగ్ యాప్స్ వలలో పడుతున్నారు. చివరకు ఉన్నదంతా కోల్పోయి, అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రాణాలు తీసుకునేందుకు కూడా వెనుకాడం లేదు. ఇలాంటి యాప్‌స్‌ను బుల్లితెర సెలబ్రిటీల నుంచి సినిమా స్టార్స్ వరకు చాలామంది ప్రమోట్ చేస్తున్నారు.**

**బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయమని అడిగారు**
ఇప్పుడిప్పుడే తప్పు తెలుసుకుని కొందరు దానికి దూరంగా ఉంటున్నారు. అయితే ఈ యాప్స్ ప్రమోట్ చేయమని తనను కూడా సంప్రదించారంటున్నాడు టాలీవుడ్ నటుడు, బిగ్‌బాస్ విన్నర్ శివబాలాజీ . శివ బాలాజీ, భార్య మధుమిత తో కలిసి ఇటీవల ఓ సాంగ్ చేశాడు. ఈ పాట రిలీజైన నేపథ్యంలో వీరిద్దరూ ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు.

**రూ.3 కోట్ల ఆఫర్**
ఈ సందర్భంగా శివ బాలాజీ, మధుమిత మాట్లాడుతూ.. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయమని రూ.3 కోట్ల ఆఫర్ ఇచ్చారు. ట్రేడింగ్, బెట్టింగ్.. ఇలా చాలావాటిని ప్రమోట్ చేయమని అడుగుతుంటారు. మమ్మల్ని ఫాలో అయే అభిమానులను ఫ్యామిలీగా భావిస్తాం. వారినెప్పుడూ సరైన దారిలోనే నడవాలని ఎంకరేజ్ చేస్తాం తప్పు పొరపాటున కూడా తప్పులు సలహాలు, సూచనలు ఇవ్వం. అందుకే అలాంటి ప్రమోషన్స్ చేయలేదు. చేయము కూడా! అని పేర్కొన్నారు.



## ధోనీ అత్యంత విలువైన క్రికెటర్..
## బ్యాటింగ్ ఆర్డర్‌పై మరోసారి ఫ్లెమింగ్ స్పష్టత!

**ధోనీ ఎందుకు ఇలా దిగువ లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు రావడమనేది అందరిలోనూ మెదిలే సందేహం. రాజస్థాన్‌తో మ్యాచ్ అనంతరం సీఎస్కే కోచ్ ఫ్లెమింగ్ దానికి స్పందించాడు.**

గత మూడు మ్యాచుల నుంచి ఒకటే ప్రశ్న.. ఎంఎస్ ధోనీ (ఎందుకు ఆరో స్థానంలోపు బ్యాటింగ్‌కు రావడం లేదు?. ఇప్పటికే ఈ ప్రశ్నకు చెన్నై సూపర్ కింగ్స్ ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ సమాధానం ఇచ్చాడు. అయినా, మీడియా నుంచి మరోసారి ఎదురైంది. దానికి స్పందిస్తూ ఫ్లెమింగ్ స్పష్టతనిచ్చాడు. రాజస్థాన్ తో మ్యాచ్‌లో ధోనీ ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. అంతకు ముందు బెంగళూరుతో పోరులో 8వ స్థానంలో ఆడాడు.

**సీఎస్కేకు వరుస షాక్‌లు.. ఎక్కడ తేడా కొడుతోంది?**

''మ్యాచ్ పరిస్థితితోపాటు ధోనీ ఫిట్‌నెస్‌ను దృష్టిలోఉంచుకుని నిర్ణయం తీసుకుంటాం. రెండేళ్ల కిందట మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అతడి ఫిట్‌నెస్‌పై పూర్తి అవగాహన ఉంది. మైదానంలో చురుగ్గానే ఉన్నప్పటికీ.. బ్యాటింగ్ విషయంలో మాత్రం 10 ఓవర్లపాటు ఆడుతూ పరుగెత్తడం చాలా కష్టం. మ్యాచ్ పరిస్థితిని బట్టి ఆర్డర్‌లో కాస్త ముందుకు వస్తాడు. అలాగని సగం ఇన్నింగ్స్ ఉన్నప్పుడు క్రీజ్‌లోకి రాలేడు. యువ క్రికెటర్లకు అవకాశం కల్పించాల్సిన అవసరమూ ఉంది'' అని ఫ్లెమింగ్ తెలిపాడు.

**భారం అవుతున్నాడా?**

సీఎస్కేకు ధోనీ భారంగా మారుతున్నాడా? అనే ప్రశ్నపై ఫ్లెమింగ్ అసహనం వ్యక్తంచేశాడు. గతేడాదే దీనిపై స్పష్టత ఇచ్చినట్లు గుర్తు చేశాడు. ''మాకు అత్యంత విలువైన ప్లేయర్ ఎంఎస్ ధోనీ. నాయకత్వం, వికెట్ కీపింగ్ విషయంలో కీలకం. అలాంటి ప్లేయర్‌ను తొమ్మిది లేదా పది ఓవర్లు ఆడించాలని మేం అనుకోవడం లేదు. అతడి ఫిట్‌నెస్ సరిపోదని మాకు తెలుసు. అందుకే, 14 ఓవర్ల నుంచైనా బ్యాటింగ్‌కు వెళ్లేలా సన్నద్ధం చేస్తున్నాం. అయితే, బ్యాటింగ్ ఆర్డర్‌లో ఉన్నవారిని బట్టి నిర్ణయాలు ఉంటాయి'' అని ఫ్లెమింగ్ వెల్లడించాడు.



## వరుసగా రెండు విజయాలు..
## ఇన్‌స్టాగ్రామ్‌లో ఆర్సీబీ ఘనత

**ఐపీఎల్ 2025లో వరుసగా రెండు మ్యాచుల్లో గెలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్ల విషయంలో రికార్డు సృష్టించింది.**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో వరుసగా రెండు మ్యాచుల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సత్తా చాటిన సంగతి తెలిసిందే. చెన్నై సూపర్ కింగ్స్‌ను సొంతగడ్డపై ఓడించి క్రికెట్ ప్రేక్షకుల మనసు గెలిచింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆర్సీబీ హవా కొనసాగుతోంది. అత్యధిక ఫాలోవర్లు ఉన్న ఐపీఎల్ ఫ్రాంచైజీల జాబితాలో సీఎస్కేను అధిగమించి ఆర్సీబీ తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది.

చెన్నై సూపర్ కింగ్స్‌ను ఇన్‌స్టాలో 17.7 మిలియన్ల మంది ఫాలో అవుతున్నారు. తాజాగా సీఎస్కేను వెనక్కి నెట్టి 17.8 మిలియన్ల మంది ఫాలోవర్లను ఆర్సీబీ సొంతం చేసుకుంది. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో సీఎస్కేతో పోల్చితే.. ఆర్సీబీ ఉత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. సోషల్ మీడియాలోనూ తగ్గేదేలేదంటూ భారీ సంఖ్యలో ఫాలోవర్లను సొంతం చేసుకుంది.

కాగా.. చెపాక్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అదరగొట్టింది. చెన్నై సొంతగడ్డపై 17 ఏళ్ల తర్వాత ఆర్సీబీ విజయం సాధించింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. 197 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 146 పరుగులకే పరిమితం అయింది. దీంతో ఆర్సీబీ 50 పరుగుల తేడాతో గెలుపొందింది.

## 'పుష్ప' స్టైల్ సంబరాలు..
## ఈ మూడు భాషల్లో సినిమాలు చూస్తా: హసరంగ

**పుష్ప క్రేజ్ మామూలుగా లేదు. క్రికెటర్లు సైతం తమ సంబరాలను ఇదే స్టైల్‌లో చేసుకోవడం ఇప్పుడు అలవాటుగా మారిపోతోంది. తాజాగా హసరంగ కూడా 'పుష్ప' తరహాలో అదరగొట్టాడు.**




ఆల్‌రౌండర్ వనిందు హసరంగ అద్భుతమైన బౌలింగ్‌తో చెన్నైపై రాజస్థాన్ విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. సీఎస్కే బ్యాటర్ శివమ్ దూబెను ఔట్ చేసిన అనంతరం 'పుష్ప' స్టైల్‌లో హసరంగ సంబరాలు చేసుకున్నాడు. దూబె ఇచ్చిన క్యాచ్‌ను రియాన్ పరాగ్ అద్భుతంగా ఒడిసిపట్టాడు. మ్యాచ్ తర్వాత తన సంబరాలపై హసరంగ స్పందించాడు. అలాగే తెలుగు, తమిళం, మలయాళం సినిమాలను చూస్తానని వెల్లడించాడు.

''ప్రాథమిక అంశాలకు లోబడి బౌలింగ్ చేసేందుకు ప్రయత్నించా. స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకున్నా. కొన్నిసార్లు వికెట్లకు దూరంగా వేశా. తొలుత మా బ్యాటర్లు మంచి స్కోరు చేయడంతో మా పని సులువైంది. రుతురాజ్ వికెట్ తీయడం ఆస్వాదించా. అతడు డేంజరస్ బ్యాటర్. మ్యాచ్‌ను మా నుంచి లాగేసేవాడే. కానీ, మా ఫీల్డర్లు అద్భుతం చేశారు. దూబె, రుతురాజ్ ఇచ్చిన క్యాచ్‌లను చక్కగా పట్టారు. హెట్‌మయెర్ గన్‌లా మైదానంలో పరుగులు పెడతాడు. దూబె ఔటైన తర్వాత 'పుష్ప' తరహాలో సంబరాలు చేసుకోవడం బాగుంది. భారత్‌లో నేను తెలుగు, మలయాళం, తమిళ సినిమాలు చూస్తుంటా. మరీ ముఖ్యంగా పుష్ప నుంచి ఎక్కువగా వీక్షిస్తున్నా. అందుకే అలా చేశా. మాకు అద్భుతమైన బౌలింగ్ ఎటాక్ ఉంది. మిడిల్ ఓవర్లలో ప్రత్యర్థులను కట్టడి చేయగలుగుతున్నాం. వేర్వేరు పాత్రలను పోషించాల్సి ఉంటుంది. కొన్నిసార్లు కొత్త బంతితో.. ఆ తర్వాత పాత బంతితోనూ బౌలింగ్ చేయాలి'' అని హసరంగ తెలిపాడు. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున హసరంగ ఆడిన సంగతి తెలిసిందే.

**రెండో బౌలర్‌గా హసరంగ**

రాజస్థాన్ తరఫున 4 అంతకంటే ఎక్కువ వికెట్ల ప్రదర్శన చేసిన రెండో బౌలర్‌గా హసరంగ నిలిచాడు. తొలి సీజన్‌లో (2008) సోహైల్ తన్వీర్ సీఎస్కే పైనే 6/14 గణాంకాలను నమోదు చేశాడు. ఇక ఐపీఎల్‌లో సీఎస్కేపై నాలుగు కంటే ఎక్కువ వికెట్లు తీసిన మూడో స్పిన్నర్ హసరంగ. ముంబయి తరఫున హర్భజన్ సింగ్ (5/18) 2011లో, కేకేఆర్ తరఫున బ్రాడ్ హాగ్ (4/29) 2015లో బెస్ట్ ఇచ్చారు.

## మెరిసిన అశ్వనీ కుమార్..
# ముంబయి బోణీ

**ఐపీఎల్ 2025లో ముంబయి ఇండియన్స్ బోణీ కొట్టింది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.**



**ముంబయి:** ఐపీఎల్ 2025 లో ముంబయి ఇండియన్స్ బోణీ కొట్టింది. కోల్‌కతా నైట్‌రైడర్స్ పై 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్.. ముంబయి బౌలర్ల ధాటికి 16.2 ఓవర్లకు 116 పరుగులకే ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ముంబయి 12.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. రికెల్‌టన్ (62*; 41 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ బాదాడు. చివర్లో సూర్యకుమార్ యాదవ్ (27*; 9 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. విల్ జాక్స్ (16), రోహిత్ శర్మ (13) పరుగులు చేశారు. కోల్‌కతా బౌలర్లలో రస్సెల్ రెండు వికెట్లు పడగొట్టాడు. (MI vs KKR)

### అదరగొట్టిన అశ్వనీ కుమార్..

కోల్‌కతా బ్యాటర్లలో రఘువంశీ (26) టాప్ స్కోరర్. రమణ్‌దీప్ సింగ్ (22), మనీశ్ పాండే (19), రింకు సింగ్ (17), అజింక్య రహానె (11) పరుగులు చేశారు. ఓపెనర్లు క్వింటన్ డికాక్ (1), సునీల్ నరైన్ (0)తోపాటు వెంకటేశ్ అయ్యర్ (3), ఆండ్రీ రస్సెల్ (5), హర్షిత్ రాణా (4) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ముంబయి బౌలర్లలో అశ్వని కుమార్ (4/24) అదరగొట్టాడు. దీపక్ చాహర్ 2, ట్రెంట్ బౌల్ట్, హార్దిక్ పాండ్య, విఘ్నేశ్ పుతుర్, శాంట్నర్ తలో వికెట్ తీశారు. ఐపీఎల్ అరంగేట్ర మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా అశ్వనీ కుమార్ రికార్డు సృష్టించాడు



## ఆసియా రెజ్లింగ్.. దీపక్, ఉదిత్‌లకు రజతాలు

**ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మరో మూడు పతకాలు చేరాయి. దీపక్ పునియా (92 కేజీ), ఉదిత్ (61 కేజీ) రజతాలు సొంతం చేసుకున్నారు. ఆదివారం 92 కేజీల ఫైనల్లో దీపక్ 0-10తో అమీర్ ఫిరోజ్‌పోర్ (ఇరాన్) చేతిలో ఓడిపోయాడు.**

**అమ్మాన్ (జోర్డాన్):** ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మరో మూడు పతకాలు చేరాయి. దీపక్ పునియా (92 కేజీ), ఉదిత్ (61 కేజీ) రజతాలు సొంతం చేసుకున్నారు. ఆదివారం 92 కేజీల ఫైనల్లో దీపక్ 010తో అమీర్ ఫిరోజ్‌పోర్ (ఇరాన్) చేతిలో ఓడిపోయాడు. ఈ పోరులో ఆరంభంలోనే 03తో వెనుకబడిన దీపక్.. తర్వాత కోలుకోలేకపోయాడు. అంతకుముందు సెమీస్‌లో దీపక్ 81తో తకాషి ఇషిగురో (జపాన్)ను ఓడించాడు. 61 కేజీల్లో ఉదిత్ రెండో స్థానంలో నిలిచాడు. తుది పోరులో అతడు 46తో తకరా సుడా (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. దినేశ్ (125 కేజీలు) కాంస్యం సాధించాడు. ముకుల్ దహియా (86కేజీ) నిరాశ పరిచాడు. కాంస్య పతక పోరులో అతడు 24తో తత్‌సుయా షిరాయ్ (జపాన్)కు తలొంచాడు. 74 కేజీల విభాగంలో జైదీప్ అహ్లావత్ తొలి రౌండ్లోనే ఓడాడు. అతడు 510తో హికారు టకాట (జపాన్)కు తలొంచాడు.







# సీఎస్కేకు వరుస షాక్‌లు..
# ఎక్కడ తేడా కొడుతోంది?

**ధోనీ జట్టులో ఉంటే చాలని మురిసిపోయిన అభిమానులు తమ అభిమాన జట్టు వరుసగా ఓడిపోవడంతోఆందోళన వ్యక్తమవుతోంది. 'ఆరో' టైటిల్ ఖాతాలో వేసుకోవాలంటే సమస్యల నుంచి బయటపడాల్సిందే.**

ఐదుసార్లు ఛాంపియన్.. ధోనీ స్పెషల్ ఎట్రాక్షన్.. విజయంతోనే ఐపీఎల్ 2025 సీజన్ స్టార్ట్.. అంతా బాగుందనుకున్న చెన్నై సూపర్ కింగ్స్ కు వరుసగా రెండు షాక్‌లు. 'ఆరో' టైటిల్ రేసును విక్టరీతో మొదలుపెట్టిన సీఎస్కే ఒక్కసారిగా వెనకబడిపోతోంది. పైకి జట్టు అంతా బాగున్నా.. సమస్యలు చుట్టుముట్టాయి. అవేంటో ఓసారి చూద్దాం.

**పవర్ ప్లేలో ప్రత్యర్థి దూకుడు..**

జట్టులో భీకరమైన హిట్టర్లు లేరు. అలాగని సరైన బ్యాటింగ్ లైనప్ కాదా? అంటే అదేం కాదు. నాణ్యమైన క్రికెట్ ఆడే ప్లేయర్లు ఉన్న జట్టు చెన్నై సూపర్ కింగ్స్ . బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలను చూస్తే అంతా బాగుందే అనిపించినా.. మ్యాచ్‌లు జరిగే కొద్దీ లోటుపాట్లు బయటపడుతున్నాయి. టీ20ల్లో పవర్ ప్లే ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఐపీఎల్‌లో ప్రతి జట్టూ దూకుడుగా ఆడి పరుగులు రాబట్టాలని చూస్తుంటుంది. బంతి పాతబడితే స్పిన్‌కు అనుకూలంగా మారుతుంది. అప్పుడు పరుగులు చేయడం కష్టమవుతుంది. చెన్నై బ్యాటర్లు విఫలమైన ఈ విభాగంలో మాత్రం.. ప్రత్యర్థులు ఆధిపత్యం ప్రదర్శించారు. కనీసం 9 నుంచి 10 రన్‌రేట్ తో సీఎస్కే బౌలర్లు పరుగులు ఇచ్చేశారు. రవిచంద్రన్ అశ్విన్ ఈసారి తేలిపోతున్నాడు. మూడు మ్యాచుల్లోనూ భారీగానే పరుగులు సమర్పించాడు. 9 ఓవర్లు వేసి 2 వికెట్లు తీసి 89 పరుగులు ఇచ్చాడు.



ఉదాహరణకు తాజాగా జరిగిన రాజస్థాన్ మ్యాచ్‌ను తీసుకుంటే.. పవర్‌ప్లేలో ఆ జట్టు 79 పరుగులు చేసింది. ఆ తర్వాత మిగతా 14 ఓవర్లలో 103 పరుగులు మాత్రమే చేయగలిగింది. అంటే తొలి 6 ఓవర్లలో భారీగా పరుగులు ఇస్తున్న చెన్నై బౌలర్లు.. తర్వాత మాత్రం కట్టడి చేయగలగుతున్నారు. అదే పవర్ ప్లేలోనూ పరుగుల ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తే గ్యారంటీగా విజయం సాధించేదని క్రికెట్ విశ్లేషకుల మాట. గత రెండు మ్యాచుల్లో విఫలమైన ఆల్‌రౌండర్ సామ్ కరన్‌ను ఈసారి పక్కనపెట్టి జేమీ ఓవర్టన్‌ను తీసుకుంది. అతడూ ధారాళంగానే పరుగులు (2 ఓవర్లలో 30 రన్స్) సమర్పించడం సీఎస్కేకు తలనొప్పిగా మారింది. పవర్ ప్లే తర్వాత.. పతిరణ, నూర్ అహ్మద్, రవీంద్ర జడేజా మాత్రమే పరుగులు కట్టడి చేస్తూ వికెట్లు తీస్తోన్న బౌలర్లు. బౌలింగ్‌లో మెరుగుకావాల్సిన అవసరం చాలా ఉందనేది కాదనలేని సత్యం.

**ఓపెనింగ్ ఎక్కడ? మిడిలార్డర్ కీలకం..**

11, 8, 0.. ఇవీ చెన్నై ఆడిన మూడు మ్యాచుల్లో ఆ జట్టు ఓపెనింగ్ పార్టనర్‌షిప్. వన్‌డౌన్‌లో వస్తోన్న కెప్టెన్ రుతురాజ్ పై ఒత్తిడి ఉన్నా రెండు హాఫ్ సెంచరీలు చేశాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన రాహుల్ త్రిపాఠి ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నాడు. గత సీజన్ వరకు ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన రుతురాజ్ మళ్లీ అదే స్థానంలోకి వస్తే బాగుంటుంది. డేవన్ కాన్వేతో కలిసి రుతురాజ్ అద్భుతమైన పార్టనర్‌షిప్‌లు నిర్మించారు. ఇక మిడిలార్డర్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీపక్ హుడా, సామ్ కరన్ తొలి రెండు మ్యాచుల్లో విఫలమయ్యారు. గత రెండు సీజన్లలో దీపక్ హుడా ఆట తీరును గమనిస్తే అత్యంత దారుణంగానే ఉంది. 23 మ్యాచుల్లో కేవలం 229 పరుగులు మాత్రమే చేశాడు. అయినా అతడిపై నమ్మకం ఉంచి సీఎస్కే అవకాశం ఇచ్చింది. దానిని నిలబెట్టుకోలేకపోయాడు. ఇక ఆల్‌రౌండర్ పాత్రలో న్యాయం చేస్తాడని ఊహించిన సామ్ కరన్ కూడా రెండింట్లోనూ తేలిపోయాడు. దీంతో వారిని పక్కనపెట్టి ఓవర్టన్, విజయ్ శంకర్‌ను తీసుకున్నా ఫలితం మాత్రం అనుకూలంగా రాలేదు. వీరిద్దరూ విఫలమై నిరాశపరిచారు. సీఎస్కే మేనేజ్‌మెంట్ ముందున్న తొలి సవాల్ మిడిలార్డర్‌ను చక్కదిద్దడమే. లేకపోతే రవీంద్ర జడేజా, దూబెపై అదనపు ఒత్తిడి పడుతోంది.

**ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌పై..**

గత సీజన్‌లో 8వ స్థానంలో వచ్చిన ధోనీ ఆర్లో సిక్స్‌లు కొట్టి అభిమానులను అలరించాడు. ఇప్పుడూ ఇదే ప్లేస్‌లో ఆడటంపై మాత్రం సీఎస్కే ఫ్యాన్స్ నుంచే విభిన్నమైన కామెంట్లు వినిపిస్తున్నాయి. అప్పుడంటే మోకాలికి శస్త్రచికిత్స చేయించుకోవడం వల్ల ఆడటం కష్టమని లోయర్ ఆర్డర్‌కే పరిమితమయ్యాడు. అదీనూ ఇంపాక్ట్ ప్లేయర్‌గా మాత్రమే బరిలోకి దిగాడు. ఈసారి ఐపీఎల్‌లో అలా కాదు. వికెట్ కీపింగ్‌లో చురుగ్గా ఉంటూ అద్భుతమైన స్టంపింగ్‌లను చేయడం చూశాం. దాదాపు 20 ఓవర్లపాటు మైదానంలోనే ఉండేంత ఫిట్‌నెస్ సాధించాడు. అలాంటప్పుడు బ్యాటింగ్‌లోనూ కనీసం ఐదు లేదా ఆరో స్థానంలో వస్తే జట్టు ఓటమి నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువనేది క్రికెట్ విశ్లేషకుల మాట. రాజస్థాన్‌తో మ్యాచ్‌లో ఏడో స్థానంలో వచ్చిన ధోనీ 11 బంతుల్లో 16 పరుగులు చేశాడు. ఆఖరి ఓవర్‌లో హెట్‌మయెర్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో పెవిలియన్‌కు చేరాడు. లేకపోతే మ్యాచ్‌ను ముగించేవాడే. మునుపటి 'ఫినిషర్'ను చూసేవాళ్లమేననేది మ్యాచ్‌ను చూసినవారికి అర్థమై ఉంటుంది.

**ఫీల్డింగ్‌లో తీసికట్టే..!**

చెన్నై జట్టులో ధోనీ వికెట్ కీపింగ్ గురించి అంతా మాట్లాడుకుంటారు. మెరుపు వేగంతో స్టంప్స్‌ను పడగొట్టాడు. అలాంటి జట్టులో ఫీల్డింగ్ వైఫల్యం కలవరానికి గురిచేస్తోంది. ఈ అంశంలో తాము ఎంతో మెరుగుపడాలని కెప్టెనే అన్నాడంటే ఈ సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాజస్థాన్ పోరులో కనీసం 20 పరుగులు అదనంగా ఫీల్డింగ్ వల్లే వచ్చాయి. ఒకవేళ అక్కడ కట్టడి చేసి ఉంటే ఆరు పరుగుల ఓటమి ఎదురయ్యేదే కా.